ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



చిత్తూరు జిల్లా వార్తలు

మంగళవారం 26 ఆగస్టు 2025



పరమసముద్రం చెరువుకు చేరుతున్న కృష్ణా జలాల్లో జనం సంబరం



కుప్పం మండలం పరమసముద్రం చెరువు సమీపంలో పరవళ్లు తొక్కుతున్న హంద్రీ-నీవా కాలువ

గంగ జాతర జరిగేది ఏడాదికోమారే. ఆ గంగమ్మ తల్లిని ఇప్పుడు ఏడాదిలో రోజూ చూసే భాగ్యం కలిగింది. ఇక గంగమ్మ మాతోటే ఉండిపోతుంది. మా భాగ్యం పండిస్తుంది.

-కుప్పం మండలం గుడ్లనాయనిపల్లెలో కాలువలోకి దిగిపోయి, ప్రవహించి ముందుకొస్తున్న కృష్ణమ్మను రెండు చేతులతో ఆప్యాయంగా తీసుకుని ముఖానికి అద్దుకుంటూ పారవశ్యంతో ఓ మహిళ చేసిన ఆనంద ప్రకటన ఇది.

ఇది కదాప్పా అబివుర్ది అంటే. నీళ్లు వొచ్చాక ఇంగేమి కావల్ల? బూమాత నవ్వులు ఈ గంగమ్మతోనే గదా చిందతాయి. పుట్ల దాన్యం పండేది ఈ గంగమ్మ తల్లివల్లే. ఇంగ తినడానికే గాదు, అమ్ముకుని బతకడానికి గూడా అదురుస్టం కలిగింది. మాయన్న చంద్రబాబు పున్నిం ఇది. ఆయప్పకు ఎట్టా థ్యాంక్స్ చెప్పాలో అర్తం గావడం ల్యా.

- శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లె వద్ద రైతుల్లో అంబరాన్నంటిన సంబరాల మాటలివి.

'గంగా'వతరణం!

పల్లెపల్లెనా పట్టరాని ఆనందం! ● పరమసముద్రం చెరువుకు చేరిన కృష్ణా జలాలు

కుప్పం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పూల వర్షం కురిపించేవాళ్లు.. కిందికి దిగిపోయి దోసిలినిండా నీటిని తీసుకుని తలమీద పోసుకునేవాళ్లు.. హారతులిచ్చి భక్తిగా మొక్కేవాళ్లు.. పారే నీటిని ముఖానికి అద్దుకుని పారవశ్యంతో కళ్లమూసుకునే వాళ్లు.. కేకలు కేరింతలతో నాట్యాలు చేసేవాళ్లు.. హంద్రీ-నీవా కాలువలో కృష్ణమ్మ బిరబిరా పరుగులు పెట్టి వస్తుంటే జనానికి ఎంత సంబరమో. పుంగనూరు పంప్ హౌస్‌నుంచి విడుదలైన కృష్ణా జలాలు, ఈనెల 23 తేదీ అర్ధరాత్రికి రామకుప్పం మండలం వర్దికుప్పం వద్ద కుప్పం నియోజకవర్గంలో ప్రవేశించాయి. అక్కడినుంచి 24వ తేదీ మధ్యాహ్నానికి శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లెకు చేరుకున్నాయి. ఇక అక్కడినుంచి శాంతిపురం మండలం సోమాపురం ద్వారా గుడుపల్లె మండలం పాపానూరుకు, అక్కడినుంచి జరుగు గ్రామం ద్వారా సోమవారం మధ్యాహ్నానికి కుప్పం మండలంలోకి కృష్ణా జలాలు వడివడిగా ప్రవహించాయి. ఇదే రోజు రాత్రికి అంతిమ స్థానమైన కుప్పం చెరువుకు చేరడంతో హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కాలువ సాగించిన 123.64 కిలోమీటర్ల ప్రయాణం ముగిసింది. ఇక నిండాల్సింది- కుప్పం, పలమనేరు నియోజకవర్గాల పరిధిలోని 110 చెరువులు మాత్రమే.

కుప్పంవాసుల కల నెరవేరింది : కుప్పంవాసుల చిరకాల కల నెరవేరిన సందర్భమిది. ఎక్కడి శ్రీశైలం ప్రాజెక్ట్.. ఎక్కడి కుప్పం... ఆరేడువందల కిలోమీటర్ల దూరంనుంచి కృష్ణమ్మ బిరాబిరా వచ్చి కుప్పం ఒడి చేరిన ఆనందం అన్నదాతది. ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం సాకారమైంది.ఒక్క కుప్పం బ్రాంచి కాలువ నిర్మాణానికే ఏకంగా రూ.560 కోట్లు వ్యయం చేశారు.ఇందులో వైసీపీ ప్రభుత్వంలో చేసింది నామమాత్రమే. అప్పట్లో నీళ్లు విడుదల చేసేశామంటూ జగన్ ఆడిన డ్రామాలు నవ్వులపాలయ్యాయి.2024లో అధికారంలోకి రాగానే ఎక్కడివక్కడ నిలిచిపోయిన హంద్రీ-నీవా కాలువ నిర్మాణ పనులకు నిధులు విడుదల చేసి వేగం పెంచి అనుకున్న సమయం కంటే ముందుగానే పూర్తి చేయించి కుప్పానికి కృష్ణా జలాలను రప్పించగలిగారు.నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కాలువ గట్టు పొడవునా ప్రవహిస్తున్న గంగమ్మను చూస్తూ కేరింతలు కొడుతున్న కుప్పం అన్నదాతలోని ఆనందం ఎనలేనిది, వెలలేనిది కూడా.ముఖ్యమంత్రి చంద్రబాబు.. కుప్పం నియోజకవర్గ ప్రజల జీవితాల్లో కృష్ణా జలాల ద్వారా వెలుగులు పూయించారు. వారి భవిష్యత్తుకు బంగారుబాటలు వేశారు. ఇది టీడీపీ నేతలు అంటున్న మాటలు కాదు. నియోజకవర్గంలో ఇప్పుడు ఏ పల్లెకు వెళ్లినా, ప్రజల నోళ్లలో నానుతున్న మాటలివి.

రేపు ఉదయం 3 గంటల నుంచే

స్వామి దర్శనం

70 వేలమంది వస్తారన్న అంచనాతో ఏర్పాట్లు

ప్రధాన ఆలయంలో ఆర్జిత సేవల రద్దు

కాణిపాక ఆలయ ఈవో కిషోర్ వెల్లడి



ఐరా(కాణిపాకం), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):వినాయక చవితి రోజు వేకువ జామున 3 గంటల నుంచే భక్తులకు కాణిపాక వినాయకస్వామి దర్శన భాగ్యం కల్పిస్తున్నట్లు ఆలయ ఈవో పెంచలకిషోర్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాకు కాణిపాక ఆలయ బ్రహ్మోత్సవ ఏర్పాట్లను తెలియజేశారు. చవితి వేడుకల్లో భాగంగా బుధవారం దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. చవితి వేడుకలకు సుమారు 70 వేల మంది భక్తులు ఆలయానికి విచ్చేస్తారన్న అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామని, 70 వేల లడ్డూలను సిద్ధంగా వుంచామని తెలిపారు.ఆగస్టు 27 నుంచి సెప్టెంబరు 16 వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నందున ఆ 21రోజులూ ఆలయంలో నిర్వహించే ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు వివరించారు. ఉభయదారులు సహకరించి స్వామికి నిర్వహించే అభిషేకాలను సమయానికి నిర్వహించాలని కోరారు.ఉత్సవాలకు వేల సంఖ్యలో భక్తులు విచ్చేస్తున్నందున ఆలయ పరిసరాలలో భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. వివిధ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిత్యం పర్యవేక్షిస్తుంటారని తెలిపారు.అలాగే చవితి రోజున ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన అన్నదాన కేంద్రాన్ని మంత్రి ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

పందిరి కొయ్యకు పూజలు



కాణిపాక ఆలయ బ్రహ్మోత్సవాలకు ఈనెల 28న ధ్వజారోహణం నిర్వహించనున్న సందర్భంగా వరసిద్ధుడి ఆలయంలో సోమవారం పందిరి కొయ్యకు పూజలు చేసి నాటారు.

296 మంది పోలీసు అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

చిత్తూరు అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సోమవారం జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం జరిగింది. ఈ ప్రక్రియను ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, ఏఆర్ ఏఎస్పీ శివానంద కిశోర్, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, ఎంటీవో చంద్రశేఖర్, ఏవో నాగభూషణమ్మ, డీపీవో సిబ్బందితో నిర్వహించారు. జిల్లాలో మొత్తం 310 మంది అభ్యర్థులు వెరిఫికేషన్ ప్రక్రియకు హాజరుకావాల్సి ఉండగా.. 296 మంది హాజరయ్యారు. 14 మంది వివిధ కారణాల చేత హాజరుకాలేదు. ఇందులో సివిల్‌లో 263 మందికి 250 మంది, ఏపీఎస్పీలో 47 మందికి 46 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయడం ఒక గొప్ప అవకాశమని, సమాజ భద్రత కోసం ప్రతి కానిస్టేబుల్ కృషి చేయాలని సూచించారు.

టౌన్‌బ్యాంకుకు ఐదుగురితో కమిటీ

చైర్మన్‌గా రమేష్ నాయుడు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వందేళ్లకు మించి చరిత్ర కలిగిన చిత్తూరు టౌన్ బ్యాంకుకు ఐదుగురితో కూడిన నాన్-అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం జీవో విడుదల చేసింది. ప్రస్తుతం అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సాగుతోంది. కొత్త చైర్మన్‌గా కాండ్ర రమేష్ నాయుడు, సభ్యులుగా డి.బాబురెడ్డి, టి.సురేష్‌బాబు, ఎ.అన్సర్, జి.నరసింహులు ఉన్నారు. వీరు పదవీ బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచి ఈ ఏడాది డిసెంబరు 8వ తేదీవరకు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడేవరకు, లేదా పాలకవర్గ ఎన్నికలు జరిగే వరకు ఈ కమిటీ కొనసాగుతుందని ఆ జీవోలో ప్రభుత్వం పేర్కొంది.

ఒకటి ఎస్సీలకు.. మరోటి బీసీలకు!

టీడీపీ అధ్యక్ష, కార్యదర్శి పదవులపై త్రిసభ్య కమిటీ ఆలోచన ● తుది నిర్ణయం చంద్రబాబుదే



ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న టీడీపీ త్రిసభ్య కమిటీ సభ్యులు

చిత్తూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్ష పదవికి తీవ్ర స్థాయిలో పోటీ నెలకొంది. సోమవారం చిత్తూరులో జరిగిన పార్టీ సమావేశంలో అధిష్ఠానం పంపించిన త్రిసభ్య కమిటీ సభ్యులు మంత్రి బీసీ జనార్దన రెడ్డి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, లిడ్ క్యాప్ చైర్మెన్ పిల్లి మాణిక్యాలరావు ఎదుటకు పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చాయి. అధ్యక్ష పదవికి 15, ప్రధాన కార్యదర్శి పదవికి 8 మంది దరఖాస్తు చేసుకున్నారు.అధ్యక్ష పదవి ఆశిస్తున్నవారిలో కమ్మ సామాజికవర్గానికి చెందినవారే అధికంగా ఉన్నారు. అయితే కీలకమైన ఈ రెండు పదవుల్లో ఒకటి ఎస్సీలకు, మరోటి బీసీలకు ఇద్దామనే ఆలోచనలో త్రిసభ్య కమిటీ ఉన్నట్లు సమాచారం.ఎస్సీ సామాజికవర్గం నుంచి పూతలపట్టు నియోజకవర్గానికి చెందిన టీడీపీ అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, పుష్పరాజ్, నగరి నియోజకవర్గానికి చెందిన దశరథవాసు, చిత్తూరు రూరల్ మండలానికి చెందిన శశికర్‌బాబు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో సప్తగిరి ప్రసాద్ టీడీపీలో యాక్టివ్‌గా ఉంటూ గట్టిగా ప్రయత్నం చేస్తున్నారు.బీసీ సామాజికవర్గం నుంచి ఇప్పటికే అధ్యక్షుడిగా ఉన్న సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నగరి నియోజకవర్గానికి చెందిన గంజి మాధవయ్య, చిత్తూరుకు చెందిన అశోక్ ఆనంద్ యాదవ్, కుప్పం నియోజకవర్గానికి చెందిన నాగరాజు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో సీఆర్ రాజన్‌కు వన్నియకుల క్షత్రియ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ పదవి ఉండడంతో అధ్యక్ష పదవిలో కొనసాగించరనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఏ ఎమ్మెల్యే ఏమన్నారంటే...

చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తన నియోజకవర్గానికి చెందిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి పల్లినేని హేమాంబరధర రావుకు అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరారు.కమ్మ సామాజికవర్గం నుంచి దరఖాస్తు చేసుకున్న ఎన్‌వీ జయప్రకాష్ నాయుడికి మద్దతుగా పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ త్రిసభ్య కమిటీతో మాట్లాడారు. పార్టీ ఎవరికి పదవి ఇచ్చినా స్వీకరిస్తామని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కమిటీకి చెప్పారు. అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్న భీమినేని చిట్టిబాబుకు ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వొద్దని జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ కోరినట్లు సమాచారం.

ప్రతి నియోజకవర్గానికీ నాలుగు పదవులు

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులు కాకుండా ప్రతి నియోజకవర్గానికీ నాలుగు పదవుల్ని కేటాయించనున్నారు. ఉపాధ్యక్షులు, కార్యనిర్వాహక కార్యదర్శి, అధికార ప్రతినిధి, కార్యదర్శి. ఈ నాలుగు పోస్టుల్ని ఏడు చొప్పున భర్తీ చేయనున్నారు. ఈ లెక్కన పార్టీ కోసం కష్టపడినవారికి మంచి పదవులు దక్కనున్నాయి. దీంతో పాటు పార్లమెంటు కమిటీ కార్యవర్గంలో 20 శాతం మహిళలకు కూడా అవకాశం కల్పించాలని అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది.

యువత అధ్యక్ష పదవి ఓసీలకే

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవుల్ని ఎస్సీ, బీసీలకు ఇస్తే తెలుగు యువత అధ్యక్ష పదవిని ఓసీలకు ఇచ్చే అవకాశం ఉంది.35 ఏళ్ల లోపు వయసున్నవారికే యువత అధ్యక్ష పదవి ఇవ్వాలని పార్టీ నిర్ణయించింది.తమకంటే తమకే యువత అధ్యక్ష పదవి అంటూ రెండు రోజులుగా చిత్తూరులో కొందరు తమ అనుచరుల ద్వారా జోరుగా పోస్టుల్ని వైరల్ చేసుకుంటున్నారు.



మహిళా ప్రయాణికులతో మాట్లాడుతున్న డీపీటీవో రాము

ఏమ్మా.. హ్యాపీయా?

చిత్తూరు రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకం అమలుపై డీపీటీవో రాము సోమవారం మహిళా ప్రయాణికులను పలకరించారు. సాధారణ ప్రయాణికుడిలా లైన్లో వేచి ఉండి బస్సెక్కారు. తర్వాత తానెవరో పరిచయం చేసుకున్నారు. 'ఏమ్మా.. ప్రయాణంలో సమస్యలున్నాయా? కండక్టర్ల ప్రవర్తన ఎలా ఉంది? ఉచిత ప్రయాణంపై హ్యాపీగా ఉన్నారా?' అని ఆరా తీశారు. ఫ్రీ బస్‌తో చాలా సంతోషంగా ఉన్నామని మహిళా ప్రయాణికులు సమాధానం చెప్పారు. అనంతరం వారి వద్ద ఉన్న ధ్రువపత్రాలను పరిశీలించారు.ఆయనవెంట సీఐ అల్తాఫ్ ఉన్నారు.

మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు తీసుకుంటున్న త్యాగరాజన్

చిత్తూరు అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్‌గా సీఎంటీ త్యాగరాజన్ సోమవారం అమరావతిలోని బీసీ కార్పొరేషన్ భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో బీసీ సంక్షేమశాఖ చీఫ్ సెక్రటరీ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా త్యాగరాజన్ మాట్లాడుతూ.. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన సీఎం చంద్రబాబు, మంత్రులు నారాలోకేశ్, పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా పరిశీలకుడు సునీల్‌కుమార్, పారిశ్రామికవేత్త కొండా నరేంద్ర, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగరాజన్, నేతలు ఉదయ్‌కుమార్, గోపాలకృష్ణన్, దిలీప్, తిరుకుమరన్, తదితరులు పాల్గొన్నారు.



శిక్షపడిన వెంకటేశ్, రాజామోహన్

పోక్సో కేసులో ఇద్దరు యువకులకు

ఆజన్మాంత జైలు

పూతలపట్టు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఇద్దరు యువకులకు బతికినంత కాలం జైలు శిక్ష విధిస్తూ చిత్తూరు న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది. మదనపల్లెకి చెందిన 16 ఏళ్ల బాలిక.. 2019 నవంబరు 24వ తేదీన తిరుమలకు వెళ్లి దేవుడి దర్శనం చేసుకుంది. అదే రోజు రాత్రి తిరుపతికి చేరుకుని తిరుచానూరుకు నడిచివెళుతుండగా బైక్‌పై వస్తుండిన తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు సమీపంలోని బ్రాహ్మణపట్టుకు చెందిన చిత్తూరు వెంకటేష్ (34)ను లిఫ్ట్ అడిగింది. అతను బాలికను బైక్‌పై ఎక్కించుకుని తిరుచానూరులో దింపకుండా ముండ్లపూడి గ్రామం వైపు తీసుకెళ్లాడు. అక్కడున్న పొదలవద్ద బైక్‌ను ఆపి.. పెట్రోల్ అయిపోయింది.. తీసుకురమ్మని తన స్నేహితుడు బుక్కే రాజామోహన్ నాయక్(34)కు ఫోన్‌చేసి చెప్పాడు. అతడు వచ్చాక రాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఇద్దరూ కలిసి బాలికను ముళ్ల పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశారు. బాలిక వారి వద్ద నుంచి తప్పించుకుని రోడ్డుపైకి వచ్చి కాపాడండి అంటూ పెద్దగా కేకలు వేసింది. అటుగా వెళుతున్న పాదచారులు గమనించి, బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై బాలిక తల్లి తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు చిత్తూరులోని పోక్సో కోర్టులో సోమవారం వాయిదాకు రాగా న్యాయమూర్తి పూర్వాపరాలు పరిశీలించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయిలకు బతికినంతకాలం జైలు శిక్షతోపాటు వెంకటేష్‌కు రూ.17,500, రాజామోహన్ నాయక్‌కు రూ.13,500 జరిమానా విధించారు. బాధితురాలికి రూ.3లక్షల నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలని న్యాయమూర్తి శంకర్‌రావు తీర్పునిచ్చారు. ఈ కేసును స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోహనకుమారి కేసును వాదించారు.

ఘాట్ రోడ్డులో అదుపు తప్పిన కారు


ప్రమాదానికి గురైన కారు


తిరుమల, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మొదటి ఘాట్ రోడ్డులో సోమవారం ఓ కారు అదుపుతప్పింది గుట్టపైకి దూసుకుపోయింది. కోయంబత్తూరుకు చెందిన భక్తులున్న కారు 12వ కిలోమీటరు వద్ద ఈ ప్రమాదానికి గురైంది. కారు ముందు చక్రం విరిగిపోయింది. కారులో ఉన్న ఇద్దరు భక్తులు క్షేమంగా బయటపడ్డారు.


మంత్రి నారాయణ - జస్టిస్ సందేశ్ - జస్టిస్ జోషి - జస్టిస్ ఎంకె థాక్కెర్ - జయం రవి - మాధవి

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. రాష్ట్ర మంత్రి నారాయణ, ఎంపీ మాగుంట శ్రీనివాసులు, తమిళ సినీ హీరో జయం రవి(రవిమోహన్), గాయని కెనిషా ఫ్రాన్సిస్, చిరంజీవి సోదరి మాధవి ఉన్నారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ హెచ్‌పీ సందేశ్, జస్టిస్ సీఎం జోషి, గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంకే థాక్కెర్ కూడా స్వామిని దర్శించుకున్నారు.

సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం : రూ.4.02 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 72,119

తలనీలాలు సమర్పించినవారు : 25,294

ఆడుదాం ఆంధ్రాకు రూ.119కోట్లు దారపోశారు

29న స్పోర్ట్స్ అకాడమీలపై ప్రకటన

శాప్ చైర్మన్ రవినాయుడు



తిరుపతి(క్రీడలు), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఆడుదాం ఆంధ్రా పోటీలకు రూ.119 కోట్లు కేటాయించి, దుర్వినియోగం చేశారని శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు ఆరోపించారు. నిధులు పూర్తిగా పక్కదారి పట్టినట్లు విచారణలో తేలిందని అన్నారు. అమరావతి చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీలలో భాగంగా సోమవారం ఉదయం ఎస్వీక్యాంపస్ హైస్కూల్ మైదానంలో విలువిద్య పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో క్రీడా అకాడమీలు రద్దు చేసిందని, వాటిని మళ్లీ ప్రారంభిస్తామని, క్రీడా పాఠశాలల సంఖ్య పెంచుతామని, ఇంటర్ వరకు మంచి శిక్షణ ఇవ్వడానికి కృషి చేస్తామని వివరించారు. అమరావతి చాంపియన్‌షిప్‌లో పది క్రీడాంశాల్లో పోటీలు జరుగుతున్నాయని తెలిపారు. కేవలం రూ.కోటిన్నర నిధులతో క్రీడాకారులకు నాణ్యమైన పరికరాలు, సదుపాయాలు కల్పించామన్నారు. ప్రతి జిల్లాలోనూ క్రీడాకారులను గుర్తించి జోనల్, రాష్ట్రస్థాయి వరకు తెచ్చామని, విజేతలకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేస్తామని అన్నారు. రాజకీయ ప్రమేయం లేకుండా జాగ్రత్తపడ్డామన్నారు. ఒలింపిక్స్‌లో ఆంధ్రా క్రీడాకారులు మెడల్స్ సాధించాలనే లక్ష్యంతో కార్యాచరణ చేశామని స్పష్టం చేశారు. విజయవాడకు చెందిన విలువిద్య క్రీడాకారులు కె.ఝాన్సీలక్ష్మి, టి.భువనరాజేశ్వరి, కె.యుక్తశ్రీ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఆడే అవకాశం లభించినందుకు ఆనందంగా ఉందన్నారు. ఇక్కడే గట్టిపోటీ ఎదుర్కొనే అవకాశం లభించిందని, తద్వారా జాతీయ స్థాయి పోటీలు సులభమవుతాయని పేర్కొన్నారు. సాయంత్రం టీటీడీ బోర్డు మెంబర్ పనబాక లక్ష్మి క్రీడా మైదానాలను సందర్శించారు. క్రీడాకారులతో ముచ్చటిస్తూ చక్కగా రాణించాలని ఆకాంక్షించారు. కాగా ఐదు వేదికల్లో పది క్రీడా పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. మంగళవారం అంతిమ ఫలితాలు రానున్నాయి.

భక్తులతో ముక్కంటి ఆలయ సిబ్బంది దురుసు ప్రవర్తన

శ్రీకాళహస్తి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయ సిబ్బంది తీరుతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. సోమవారం సిబ్బంది అనుసరించిన తీరు విమర్శలకు దారితీసింది. భక్తులకు అంతరాలయ దర్శనం చేరువ చేసేందుకు రూ.500 టిక్కెట్లను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. దీనికోసం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద నుంచి చెక్క మెట్లపై క్యూలైన్ ఏర్పాటు చేశారు. ఇక్కడ కాశీ అనే ఒప్పంద ఉద్యోగి టిక్కెట్లను తనిఖీ చేస్తుంటాడు. సోమవారం కొందరు మహిళా అధికారులు అంతరాలయ దర్శనానికి వెళుతుండగా కాశీ మెట్లపై అడ్డంగా కూర్చున్నాడు. వారు పక్కకు జరగాలని కోరడంతో ఆగ్రహంతో పోతేపోండి అంటూ దురుసుగా ప్రవర్తించాడు. అలాగే కొందరు అర్చకులు హారతి పళ్లేలతో క్యూ వద్దనే అడ్డంగా నిలబడి దక్షిణ సమర్పిస్తేనే హారతి ఇస్తూ భక్తుల పట్ల కస్సుబుస్సులాడారు. అలాగే అమ్మవారి సన్నిధిలోనూ కొందరు సిబ్బంది దళారులకు రాచబాట వేస్తున్నారు. ఇక అక్కడ పనిచేసే ఓ ఉద్యోగి దురుసుగా వ్యవహరించడంపై సోమవారం పలువురు భక్తులు విస్మయం చెందారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మూడు నెలల గడువు ఇచ్చిందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్‌కు లేఅవుటు రెగ్యులైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి, సమీప ప్రాంతాల్లో అక్రమ లేఅవుట్లు అధికంగా ఉన్నాయని, ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి

ప్రశంసల జల్లు

ఎన్‌పీఎం సేవలపై కేంద్ర బృందం కితాబు



శ్రీకాళహస్తి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సిజేరియన్ కాన్పులను కట్టడి చేసే క్రమంలో శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో అందిస్తున్న సేవలపై కేంద్ర బృందం, యూనిసెఫ్ ప్రతినిధులు ప్రశంసల జల్లు కురిపించారు. యూనిసెఫ్ రాష్ట్ర ప్రతినిధి నాగేంద్ర పర్యవేక్షణలో నర్స్ ప్రాక్టిషనరీ మిడ్‌వైఫ్(ఎన్‌పీఎం) సేవలందిస్తూ ఇక్కడి ప్రభుత్వాస్పత్రి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌కు చెందిన కేంద్ర బృందం, యూనిసెఫ్ ప్రతినిధులు సోమవారం ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. ఇక్కడి ఎన్‌పీఎం విభాగం అనుసరిస్తున్న విధానాలను పరిశీలించారు. ఓపీలో గర్భిణులకు చేస్తున్న ఎన్‌పీఎంలు పరీక్షలతోపాటు వ్యాయామాలు, మ్యూజిక్ థెరపీ, కౌన్సెలింగ్ ఇస్తున్న తీరుపై ఆరా తీశారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని ప్రభుత్వాస్పత్రుల్లో ఈ పద్ధతులు అమలు చేసేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర యూనిసెఫ్ ప్రతినిధి నాగేంద్ర మాట్లాడుతూ గర్భం దాల్చిన తొలిరోజుల్లో ఎన్‌పీఎం విభాగాన్ని ఆశ్రయిస్తే మూడు త్రైమాసికాల్లో వ్యాయామాలు, యోగాలకు సంబంధించి శిక్షణ ఇస్తారన్నారు. పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తూ సానుకూలమైన శస్త్రచికిత్స నిర్వహిస్తారన్నారు. అనవసర మందులు వాడకుండా, శాస్త్రీయ విధానాలతో సహజసిద్ధంగా హార్మోన్ల ఉత్పత్తి ద్వారా సుఖప్రసవం సునాయాసంగా జరిగేలా చర్యలు తీసుకుంటారన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ మణిని ఆయన అభినందించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్‌హెల్త్‌కు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ భారతీశర్మ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వీణా, రీసెర్చ్ అసోసియేట్లు మౌనిక, నీరల్ పటేల్, ఆస్పత్రి ఆర్ఎంవో విజయలక్ష్మి, సీనియర్ గైనకాలజిస్టు హరిప్రియ, నర్సింగ్ సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు డీఎస్సీ ప్రక్రియ

● ఎల్లుండి నుంచి అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

● నేటినుంచి కాల్ లెటర్ల డౌన్‌లోడ్‌కు అవకాశం

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,478 టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించి ఈనెల 22వ తేదీన అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదలైన విషయం తెలిసిందే. ఈ జాబితా ఆధారంగా రాష్ట్ర విద్యాశాఖ సూచనలతో గురువారం నుంచి చిత్తూరులో అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రారంభిస్తారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి మెగా డీఎస్సీ-2025 లాగిన్ ఐడీల ద్వారా అభ్యర్థులు తమ కాల్‌లెటర్లు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి.. పరిశీలనకు 30 బృందాలు

అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. చిత్తూరులోని అపోలో, ఎస్వీసెట్ కళాశాలలను ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు వేదికలుగా నిర్ణయించారు. గురువారం ఉదయం తొమ్మిది గంటల నుంచి అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీ సమయం, వేదికకు హాజరు కావాల్సి ఉంది. హాజరు కాని, అర్హత లేని అభ్యర్థిత్వం రద్దు చేయనున్నారు. అటువంటి సమయంలో తదుపరి మెరిట్ జాబితాలోని అభ్యర్థిని సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలవనున్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు 30బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ఎంఈవో, హెచ్ఎం,రెవెన్యూడీటీ, మండల ఇన్ఫర్మేషన్ సిస్టమ్ సిబ్బంది ఉంటారు.ఒక్కో బృందం కేవలం 50 మంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన మాత్రమే చేస్తుంది. ఏ అభ్యర్థి, ఏ బృందం వారి వద్ద ధ్రువీకరణ పత్రాలు పరిశీలన చేసుకోవాలనే వివరాలు వారి మొబైల్‌కు రాష్ట్ర విద్యాశాఖ సమాచారం పంపుతుంది. ఈ బృందాల పర్యవేక్షణకు పది బృందాలు ఏర్పాటు చేశారు. ఈ బృందంలో డిప్యూటీ డీఈవో, ఇద్దరు ఎంఈవో/హెచ్ఎంలు ఉంటారు. మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థి పూర్తి సమాచారాన్ని రాష్ట్ర విద్యాశాఖ ఇప్పటికే జిల్లా విద్యాశాఖ లాగిన్‌కు పంపింది. కేవలం సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరు కావడం వల్ల అభ్యర్థికి ఎలాంటి ఎంపిక హక్కు కలుగదు. ఎంపిక పూర్తిగా మెరిట్, అర్హత, రిజర్వేషన్, నియమనిబంధనల ఆధారంగానే ఉంటుందని విద్యాశాఖ ప్రకటించింది. ఎవరైనా అభ్యర్థులు నకిలీ/తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించారని తేలితే క్రిమినల్ చర్యలుతీసుకునే అవకాశం ఉంది.

ధ్రువీకరణ పత్రాలిలా..

● అభ్యర్థులు ఇటీవల తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, అంగవైకల్యం ధ్రువీకరణ పత్రం, పోస్టుకు సంబంధించిన అర్హతల ఆధారంగా ఒరిజినల్ సర్టిఫికెట్లుతోపాటు అన్నీ స్కాన్డ్‌కాపీలను తయారు చేసుకోవాలి. ● అప్లోడ్ చేసిన సర్టిఫికెట్ల అన్నీ మూడు సెట్ల జెరాక్స్ కాపీలను తీసుకుని గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించుకుని రావాలి ● ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను తేవాలి ● అభ్యర్థులు వ్యక్తిగత లాగిన్‌లో అవసరమైన సర్టిఫికెట్ల స్కాన్డ్ కాపీలను వెరిఫికేషన్ రాకముందే మెగా డీఎస్సీ 2025 లాగిన్‌లో అప్లోడ్ చేసి ఉండాలి.

ఉమ్మడి చిత్తూరు జిల్లా రోస్టర్‌లో పోస్టుల మేనేజ్‌మెంట్ల వారీగా వివరాలు

కేటగిరీ	ప్రభుత్వ, స్థానిక యాజమాన్యం	మున్సిపల్	మున్సిపల్ కార్పొరేషన్	మొత్తం
ఓసీ	511	26	41	578
బీసీ-ఏ	94	6	11	111
బీసీ-బీ	127	5	7	139
బీసీ-సీ	18	1	0	19
బీసీ-డీ	91	5	6	102
బీసీ-ఈ	48	2	3	53
ఎస్సీ-గ్రేడ్ 1	16	1	4	21
ఎస్సీ-గ్రేడ్ 2	84	4	6	94
ఎస్సీ-గ్రేడ్ 3	102	4	6	112
ఎస్టీ	85	5	5	95
ఈడబ్ల్యూఎస్	125	5	8	138
పీహెచ్-విజువల్	1	0	0	1
పీహెచ్-హియర్	10	0	0	10
ట్రైబల్‌వెల్ఫేర్ (ఆశ్రమ)	5	0	0	5
	1317	**64**	**97**	**1478**

అధ్యక్ష పదవికి పోటాపోటీ

కొనసాగేందుకు ఆసక్తి చూపుతున్న నరసింహ యాదవ్

మార్చే పక్షంలో అవకాశం కోసం శ్రీధర వర్మ పట్టు

నేడు టీడీపీ పార్లమెంటు కమిటీపై సమావేశం

తిరుపతి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి టీడీపీ పార్లమెంటు కమిటీ అధ్యక్ష పదవిపై ఉత్కంఠ నెలకొంది. వివిధ సమీకరణాలతో పలువురు నేతలు రేసులో ఉన్నారు. ఎవరికి వారు తమ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం రేణిగుంట వైకన్వెన్షన్ హాలులో జరిగే టీడీపీ పార్లమెంటు విస్తృత స్థాయి సమావేశంపై ఆసక్తి నెలకొంది. ప్రస్తుత అధ్యక్షుడు నరసింహయాదవ్ మరోసారి అధ్యక్ష పదవిలో కొనసాగాలని భావిస్తున్నా గట్టిగా పట్టుబట్టడం లేదు. ఆయననే కొనసాగించాలని నిర్ణయిస్తే సమస్యే లేదు. మారిస్తే మాత్రం గట్టి పోటీ ఏర్పడుతుంది. నామినేటెడ్ పదవులేవీ లభించని మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ ఈ పదవి తనకు వస్తుందని నమ్ముతున్నారు. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి కూడా ఆశిస్తున్నారు. అధ్యక్ష రేసులో ఉన్న అదే సామాజిక వర్గ సీనియర్ నేత సూరా సుధాకర్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మద్దతు ఇస్తున్నట్టు సమాచారం. సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, మాజీ మంత్రి పరసా రత్నం, గురవారెడ్డి(శ్రీకాళహస్తి), రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం కూడా పోటీ పడుతున్నారు. కుల సమీకరణ లెక్కలు వేసుకుంటున్నారు. శాప్ చైర్మన్ రవినాయుడు పేరు తెరపైకి వచ్చినా తెలుగు యువత రాష్ట్ర అధ్యక్ష పదవి కేటాయించే అవకాశముందని సమాచారం.

సమతూకం పాటించాలి

పార్లమెంటు కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల పదవుల ఎంపికలో సామాజికవర్గాలు, నియోజకవర్గాలకు సమతూకం వేయాలని అధిష్టానం ఆదేశించినట్టు తెలిసింది. ఈ మేరకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిందంటున్నారు. అధ్యక్ష పదవి ఒక వర్గానికి ఇస్తే ప్రధాన కార్యదర్శి మరో వర్గానికి కేటాయించాల్సి ఉంటుంది. ప్రధాన పదవులను నియోజకవర్గానికి ఒకటి దక్కేలా జాగ్రత్త పాటించాలి. కమిటీలోనూ, అనుబంధ విభాగాల్లోనూ తప్పనిసరిగా యువత, మహిళలకు 33 శాతం వంతున పదవులు కేటాయించాలని భావిస్తున్న క్రమంలో వారి ప్రాతినిథ్యం పెరిగే అవకాశముంది. కాగా పదవికి కనీసం మూడు దరఖాస్తులు ఉండాలని అధిష్టానం త్రీమెన్ కమిటీని ఆదేశించినట్టు చెబుతున్నారు. వచ్చే నెల 3వ తేదీలోపు కమిటీలు ఖరారు కావాలని నిర్ణయించిన నేపథ్యంలో తిరుపతి పార్లమెంటు కమిటీపై ఈ నెలాఖరులోపే ప్రకటన వెలువడనుంది.

జూన్‌లోపు తుడా టవర్స్ పూర్తి

మంత్రి నారాయణ

తిరుపతి, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి) : తిరుపతిని మెగా సిటీగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయని, ఇందులో భాగంగానే మహా నగరం చేయాలని సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ అన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ, తుడా అభివృద్ధి పనులపై సోమవారం తుడా కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్షించారు.తుడా, నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అన్నారు. జూన్‌లోపు తుడా టవర్స్‌ను పూర్తిచేయాలని చెప్పారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో స్కావెంజర్స్ కాలనీ వాసుల పరిస్థితి చూసి ఎంతో బాధ కలిగిందని, వారికి 8 నెలల్లోనే అపార్టుమెంట్లు కట్టిస్తామని అన్నారు. తిరుపతి, తణుకులో టీడీఆర్ బాండ్ల జారీలో గోల్‌మాల్‌పై విచారణ జరుగుతోందన్నారు. కమిటీ ద్వారా పరిశీలించి అర్హులైన వారికి జారీ చేస్తున్నామన్నారు. శెట్టిపల్లి భూముల సమస్యను త్వరలోనే పరిష్కరించనున్నామని తెలియజేశారు.

ఏడు ఎర్రచందనం దుంగల స్వాధీనం


పట్టుబడిన ఎర్రచందనంతో ఫారెస్టు అధికారులు

ఎర్రావారిపాళెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఏడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. ఆయన కథనం మేరకు సోమవారం తెల్లవారుజామున ఎల్లమంద వై-జంక్షన్ వద్ద ఫారెస్టు సిబ్బంది కాపు కాచి ఉన్నారు. ఆదే సమయంలో ఉస్తికాయలపెంట నుంచి అతివేగంగా ఓ కారు రావడాన్ని గుర్తించారు. ఆపేందుకు విఫలయత్నం చేసి వెంటనే వెంబడించారు. దీంతో కొంతదూరంలో కారును చెట్ల మధ్య ఆపి ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. కారులో పరిశీలించగా 160 కేజీల బరువున్న ఏడు ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ.8 లక్షలు ఉంటుందని భావిస్తున్నారు. దాడిలో రేంజ్ ఆఫీసర్ వెంకటరమణతోపాటు సిబ్బంది ముని స్వామి నాయక్, లక్ష్మీప్రసాద్, సదాశివయ్య, రాజేష్ కుమార్ , శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అద్దాల మేడను కాపాడుకుందాం


కార్వేటినగరంలోని అద్దాలమేడ


భవనానికి ఎగబాకిన పిచ్చి మొక్కలు

వెదురుకుప్పం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో రాజుల కాలంలో నిర్మించిన చారిత్ర కట్టడానికి ఆలనా పాలనా కరువైంది. రాణికి బహుమానంగా నిర్మించిన అద్దాల మేడ (లక్ష్మీ మహల్) శిథిలావస్థకు చేరువైంది. భవనానికి పిచ్చిమొక్కలు ఎగబాకాయి. కార్వేటినగరంలో అప్పటి సంస్థానాధీశులైన రాజా వెంకట పెరుమాళ్‌రాజు ఆరోజుల్లోనే కళాఖండాలు ఉట్టిపడే విధంగా నిర్మాణాలు చేపట్టారనడానికి ఈ మేడ ఒక ప్రతీక. లక్ష్మీమహల్‌ను సున్నంతోపాటు కోడిగుడ్ల జన ఉపయోగించి నిర్మాణం చేయడం వల్ల ఇప్పటికీ కోట గోడలు అద్దం వలె మెరుస్తూ ఎదురుగా నిలబడిన వ్యక్తి ప్రతిబింబం కనిపించడం దీని ప్రత్యేకత. ఈ అద్దాల మేడను రాణికి బహుమానంగా మూడు శతాబ్దాల కిందట నిర్మించి ఇచ్చారట. గత వైసీపీ పాలనలో పురావస్తుశాఖకు అప్పగించినా ఇప్పటికీ దాని ఆలనా పాలనా గురించి పట్టించుకున్న నాథులే లేరన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటి ప్రభుత్వ పెద్దలైనా పట్టించుకుని చంద్రగిరి కోట తరహాలో అద్దాల మేడ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఖో-ఖో విజేతలుగా జోన్ 2ఉమెన్, 3మెన్ జట్లు


పరుగు పందెం, వాలీబాల్ ఆడుతున్న కలెక్టర్


బాస్కెట్‌బాల్ విజేత జోన్ 1 ఉమెన్ జట్టు - బాస్కెట్‌బాల్ విజేత జోన్ 1 మెన్ జట్టు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అమరావతి చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీలు రెండో రోజైన సోమవారం ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. సాయంత్రానికి ఖో-ఖోలో తుది ఫలితాలు వచ్చాయి. మెన్ విభాగంలో జోన్ 3 జట్టు, ఉమెన్ విభాగంలో జోన్ 2జట్టు విజేతలుగా నిలిచాయి. బాస్కెట్‌బాల్‌లో జోన్1 ఉమెన్, జోన్ 1మెన్ జట్లు గెలుపొందాయి. ఎస్వీయూ క్యాంపస్‌స్కూల్ మైదానంలో ఆర్చరీ, వాలీబాల్, ఎస్వీయూ గ్రౌండ్‌లో అథ్లెటిక్స్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ ఇండోర్‌హాల్లో బాక్సింగ్ పోటీలు, శ్రీనివాస క్రీడా సముదాయంలో కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగాయి. శాప్ చైర్మన్ రవినాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్ పర్యవేక్షించారు. ముఖ్య అతిథులుగా టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాకలక్ష్మి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, శాప్ డైరెక్టర్లు రజనీ, రవీంద్రనాథ్, సంతోష్‌కుమార్, డీఎస్‌డీవోలు శశిధర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


కబడ్డీ విజేత జోన్ 2 మెన్ జట్టు, ఆర్చరీ, బాక్సింగ్, కబడ్డీ

15 కేజీల గంజాయి స్వాధీనం

నాయుడుపేట టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెన్నై రహదారి సమీపంలో 15 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి 15 మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలను మీడియా సమావేశంలో వెల్లడిస్తామని పోలీసులు చెప్పారు.

28న అథ్లెటిక్స్ జిల్లాస్థాయి పోటీలు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని కేవీఎస్ మైదానంలో ఈనెల 28న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడిజిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రాబర్ట్‌రాజనందన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అండర్ 14, 16, 18, 20 విభాగంలో బాల బాలికలకు ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆరోజున ఉదయం 8గంటలకు ఆధార్, జనన ధృవీకరణ పత్రం జిరాక్సులతో తప్పనిసరిగా మైదానానికి చేరుకోవాలి. మరిన్ని వివరాల కోసం 86868 67079 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



పరమసముద్రం చెరువు వద్ద కలెక్టర్,ఎస్పీ పరిశీలన

కుప్పం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):ఈనెల 29, 30 తేదీలలో ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పంలో పర్యటించనున్న నేపథ్యంలో కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ సోమవారం కుప్పం చేరుకుని సంబంధిత ఏర్పాట్లను పర్యవేక్షించారు. హంద్రీ-నీవా కాలువ అంతిమ స్థానమైన కుప్పం మండలం పరమసముద్రం చెరువు వద్ద ఈనెల 30న సీఎం జలహారతి ఇవ్వనున్నారు. కాలువ వొడ్డున నిర్మించిన పైలాన్‌ను ఆవిష్కరించి, ఆ సమీపంలోనే జరిగే బహిరంగ సభలో కుప్పం ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు. ఆయా ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీలు పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి పొరపాటు దొర్లకుండా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎస్ఎస్ ఏపీసీకి మాతృశాఖలో పదోన్నతి



వెంకటరమణ

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రశిక్షలో అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ (ఎస్ఎస్ ఏపీసీ)గా పనిచేస్తున్న మద్దిపట్ల వెంకటరమణకు ఆయన మాతృశాఖైన కో-ఆపరేటివ్‌లో పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు జిల్లా కో-ఆపరేటివ్ శాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ స్థాయి నుంచి డివిజనల్ కోఆపరేటివ్ అధికారిగా పదోన్నతి లభించింది. ఈ క్రమంలో చిత్తూరు డివిజన్ లెవల్ కోపరేటివ్ అధికారిగా పోస్టింగ్ ఇచ్చింది. ప్రస్తుతం ఈయన ఫారిన్ సర్వీసెస్ కేటగిరీలో ఇటీవలే ఎస్ఎస్ ఏపీసీగా డిప్యుటేషన్‌పై వచ్చారు. పదోన్నతి రావడంతో ఏపీసీ కేడర్ నుంచి రిలీవ్ కావాల్సి ఉంది. కాగా, పదోన్నతి పోస్టు చిత్తూరులోనే ఉండటంతో డివిజనల్ లెవల్ కో-ఆపరేటివ్ అధికారి పోస్టుతోపాటు ఎస్ఎస్ ఏపీసీ రెగ్యులర్‌గా కాకుండా ఎఫ్ఏసీ కింద కొనసాగించాలా? వద్దా? అని నిర్ణయించే అధికారిరాన్ని ప్రభుత్వం కలెక్టర్‌కు అప్పగించింది. కలెక్టర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

రోడ్డు దాటుతుండగా..బంగారు చైన్ లాక్కెళ్లారు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వాకింగ్ చేసి ఇంటికి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా ఓ మహిళ మెడలోని బంగారు చైన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు లాక్కెళ్లారు. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరులోని గొడుగుచింతకు చెందిన అంజలి తన భర్త, బిడ్డతో కలిసి పీవీకేఎన్ డిగ్రీ కళాశాల మైదానానికి ఆదివారం సాయంత్రం వాకింగ్‌కు వెళ్లారు. గంటపాటు భార్యభర్తలు వాకింగ్ చేశారు. మరో రౌండ్ వాకింగ్ వెళ్లివస్తానని భర్త చెప్పడంతో బిడ్డను ఎత్తుకుని అంజలి రోడ్డు దాటే ప్రయత్నం చేసింది. అక్కడే ద్విచక్ర వాహనంలో ఉన్న ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అంజలి మెడలోని సుమారు 24 గ్రాముల బంగారు చైన్‌ను లాక్కెళ్లిపోయారు. దీనిపై సోమవారం పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం: నలుగురి అరెస్టు



నిందితుల వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

నగరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అరకిలో గంజాయిని స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్టు చేశారు. వివరాలను పోలీస్‌స్టేషన్‌లో నగరి సీఐ విక్రమ్ సోమవారం మీడియాకు తెలిపారు. నగరిలో గంజాయిపై ఎస్పీ, నగరి డీఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా.. సోమవారం వచ్చిన సమాచారంతో నగరి మండలం తడుకుపేట వద్ద తిరుపతి-చెన్నై హైవేను ఆనుకుని ఉన్న మిక్సింగ్‌ప్లాంట్ వద్ద సాయంత్రం 5.30 గంటలకు నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు అర కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చెన్నైలోని ఆవడికి చెందిన వెంకటేష్ అలియాస్ కార్తీక్ (23), కమలేష్(18) తమకు పరిచయమున్న తడుకుపేట ఎస్టీకాలనీకి చెందిన ఉదయ్‌కిరణ్, దేవేంద్ర వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేస్తుండగా పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను పట్టుకున్న సిబ్బంది సత్య, గజేంద్ర, కదిరివేలు, గోపి, లోకనాథం, రవి, సురేష్, రమేష్‌లను ఆయన అభినందించారు. సమావేశంలో ఎస్ఐ విజయకుమార్‌నాయక్, తేజస్విని, డీటీ మేఘవర్ణం పాల్గొన్నారు.

రేపు దేవదాయశాఖ మంత్రి రాక

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి బుధవారం జిల్లా పర్యటనకు వస్తున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. 27న ఉదయం 8 గంటలకు రోడ్డు మార్గాన బయల్దేరి 9.15 గంటలకు కాణిపాకం చేరుకుంటారు. వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు అందజేస్తారు.

11 బార్లకు మూడు దరఖాస్తులు

● నేటితో ముగియనున్న గడువు

చిత్తూరు సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేయనున్న బార్ లైసెన్స్‌ల దరఖాస్తుకు మంగళవారంతో గడువు ముగియనుంది. సోమవారం వరకు 11 బార్లకు కేవలం మూడు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. మంగళవారం సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ గడువు ముగుస్తుంది. ఒక బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీద్వారా బార్ల కేటాయింపు ఉంటుందని ప్రభుత్వం నిబంధన పెట్టింది. ఒక్కరోజు గడువుండటంతో దరఖాస్తులు రావచ్చని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు.

అనారోగ్యంతో అర్చకుడి మృతి



హరీష్(ఫైల్‌ఫొటో)

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో పరివార ఆలయమైన వీరాంజనేయ స్వామి ఆలయ అర్చకుడు హరీష్(50) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఇటీవల ఆయన్ను బెంగళూరులో చికిత్స కోసం కుటుంబ సభ్యులు చేర్చారు.చివరకు కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకొస్తున్న క్రమంలో ఆయన మృతి చెందారు. మృతుడికి భార్య వేదవతి, ఇద్దరు కుమార్తెలున్నారు. ఆయన స్వగ్రామమైన ఐరాలలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. కాణిపాక ఆలయ ఈవో పెంచల కిషోర్ హరీష్ మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏఈవో రవీంద్రబాబు పాల్గొన్నారు.

హంద్రీ-నీవాలో నీటి చౌర్యానికి పాల్పడితే కేసులు

పుంగనూరు రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కాలువ నీటిని చోరీ చేయడానికి ప్రయత్నం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ సుబ్బరాయుడు హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎవరైనా పంపుహౌస్ వద్ద సిబ్బందిని ఇబ్బందులకు గురి చేసినా, మధ్యలో ఏర్పాటు చేసి గేట్లు వద్ద నీటిని మళ్లించడానికి ప్రయత్నం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు . రైతులు రాత్రి వేళ నీటిని చోరీ చేయడానికి ప్రయత్నం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

పైరవీలు చేస్తే కాదు...కష్టపడినోళ్లకే పదవులు

టీడీపీ పరిశీలకుల త్రిసభ్య కమిటీ
ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

చిత్తూరు సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో పైరవీలు చేస్తే పదవులు రావని....కష్టపడి పనిచేసిన వారికి వెతుక్కుంటూ వస్తాయని పార్టీ త్రిసభ్య కమిటీ స్పష్టం చేసింది.చిత్తూరులోని ఎస్‌పీఎస్ భాస్కరా హోటల్‌లో సోమవారం టీడీపీ పార్లమెంటరీ కమిటీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది.చిత్తూరు పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు, జిల్లా కమిటీ, అనుబంధ విభాగాల కమిటీల నియామకంపై పార్టీ పరిశీలకులుగా వచ్చిన ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన రెడ్డి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు కమిటీల ఎంపిక జరుగుతుందని, క్షేత్ర స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, కీలక నాయకుల అభిప్రాయాలను అధిష్ఠానం దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. టీడీపీ కమిటీల్లో 30 శాతం యువతకు ప్రాధాన్యత కల్పించడంతో పాటు, 70 శాతం అనుభవానికి పెద్దపీట వేసే విధంగా కమిటీల కూర్పు ఉంటుందన్నారు. పరిశీలకులుగా తమ దృష్టికి వచ్చే అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకుని, వాటిని కూలంకుషంగా చర్చించి, అధిష్ఠానం దృష్టికి తీసుకువెళతామని వివరించారు. అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యమని, పదవులు దక్కినా, దక్కకపోయినా పార్టీ నిర్ణయాన్ని గౌరవించి అభివృద్ధికి అందరితో కలసి పని చేయాలని కోరారు. పెద్ద పార్టీ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన రెడ్డి

కావడంతో పదవులు ఆశించేవారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుందని, అందరినీ అన్ని వేళలా సంతృప్తి పరచలేమని చెప్పారు. పదవులకు అతీతంగా పార్టీ అభివృద్ధి కోసం క్రమశిక్షణతో పనిచేసే క్రియాశీలక నాయకులకు, కార్యకర్తలకు భవిష్యత్తులో పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందన్నారు.ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, గురజాల జగన్మోహన్, డాక్టర్ థామస్, గాలి భానుప్రకాష్, మాజీ ఎమ్మెల్యేలు ఏఎస్ మనోహర్, మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, గౌనివారి శ్రీవాసులు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు సురేంద్రకుమార్, సప్తగిరి ప్రసాద్, పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.సమావేశం అనంతరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల పోస్టుల్ని ఆశించేవారి నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. ప్రజాప్రతినిధులు, కీలక నాయకుల నుంచి అభిప్రాయాలను సేకరించారు.

మొత్తం దరఖాస్తులు 23

పార్టీ అధ్యక్ష, కార్యదర్శి పదవులకు ఈ సారి పోటీ పెరిగింది. సీఆర్ రాజన్, ఏఎస్ మనోహర్, ఎన్‌పీ జయప్రకాష్ నాయుడు, గౌనివారి శ్రీనివాసులు, భీమినేని చిట్టిబాబు, వసంత్ కుమార్, కాజూరు బాలాజీ, గురజాల సందీప్, గంజి మాధవయ్య, దశరథ వాసు, అశోక్ ఆనంద్ యాదవ్, పుష్పరాజ్, సప్తగిరి ప్రసాద్, షణ్ముగం, గిరిధర్ బాబు, వినోద్ కుమార్, గుర్రం వెంకటేశ్వర్లు తదితరులు.. మహిళా కోటాలో కార్జాల అరుణ, లత అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్నారు.

సమస్యలివిగో.. పరిష్కరించండి

కలెక్టరేట్‌లో జరిగిన 'పీజీఆర్ఎస్'కు 359 అర్జీలు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు బాధితులు బారులు తీరారు. తమ సమస్యలను ఏకరువు పెట్టారు. అర్జీలను జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ నరేంద్రపాడల్, డీఆర్వో మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్లు విజయలక్ష్మి, ప్రసన్న కుమారి స్వీకరించారు. మొత్తం 359 అర్జీలు వచ్చాయి. వీటిల్లో.. రెవెన్యూ, సర్వే శాఖకు సంబంధించి 258, డీఆర్‌డీఏకు 18, డీసీహెచ్ఎస్‌కు 10, డీఎంహెచ్‌వోకు 8, పోలీసుశాఖకు 8, విద్యాశాఖకు 7, వ్యవసాయశాఖకు 6, పంచాయతీరాజ్‌శాఖకు 5, ఇరిగేషన్‌కు 5 అర్జీలతోపాటు ఉద్యానశాఖ, పశుసంవర్థక శాఖ, సైనిక సంక్షేమశాఖ, గురుకుల విద్యాలయం, పౌరసరఫరాల శాఖ, దివ్యాంగుల శాఖ, గృహ నిర్మాణం, గ్రామీణ నీటిపారుదలశాఖలకు 34 అర్జీల చొప్పున ఉన్నాయి. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపగా.. మరికొన్నింటిని నిర్దీత వ్యవధిలోగా పరిష్కరిస్తామని బాధితులకు అధికారులకు హామీ ఇచ్చారు.

మా బడిని విలీనం చేయొద్దు

తమ బడిని విలీనం చేస్తే సుమారు మూడు కిలోమీటర్ల దూరం



అర్జీలను పరిశీలిస్తున్న అధికారులు

పిల్లలు నడిచి వెళ్లాల్సి వస్తోందని కార్వేటినగరం మండలం గొల్లకండ్రిగ గ్రామస్తులు తెలిపారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. విచారించి గతంలో పాఠశాలనే యథావిధిగా కొనసాగించాలని కోరారు.

సిమెంటు రోడ్డు వేయకుండా అడ్డుకుంటున్నారు

నిధులు మంజూరైనా సిమెంటు రోడ్డు వేయకుండా అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని వెదురుకుప్పం మండలం బొమ్మాయిపల్లె దళితులు కోరారు. రోడ్డు నిర్మాణం కోసం పీఎంఏజీవై, ఎన్ఆర్‌జీఎస్ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఉన్నతాధికారులు విచారించి, సమస్య పరిష్కరించాలని కోరారు.



కలెక్టరేట్ వద్ద బొమ్మాయిపల్లె దళితులు

పింఛను మంజూరు చేయండి



కుటుంబీకులతో గజేంద్రబాబు

బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో రెండు కాళ్లూ చచ్చుపడిపోయిన తనకు పింఛన్ మంజూరు చేయాలని చిత్తూరు మండలం నరసింగరాయనిపేటకు చెందిన గజేంద్రబాబు మొరపెట్టుకున్నాడు. తనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని తెలిపారు. పిల్లల చదువులు, కుటుంబ పోషణ కష్టంగా ఉందన్నారు.

పోలీసులకు 32 అర్జీలు

జిల్లా పోలీసు ఏఆర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 32 అర్జీలు అందాయి. కొన్ని సమస్యలను ఏఎస్పీలు రాజశేఖర్‌రాజు, శివానంద కిశోర్ అక్కడికక్కడే వీడియో కాన్ఫరెన్స్, సెల్ కాన్ఫరెన్స్ ద్వారా పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. వచ్చిన అర్జీల్లో.. భూ తగాదాలపై 12, కుటుంబ తగాదాలపై 6, డబ్బు తగాదాలపై 5, ఇంటి తగాదాలపై 4, వేధింపులపై 3, దారి తగాదాలపై 2 చొప్పున ఉన్నాయి.



అర్జీని పరిశీలిస్తున్న ఏఎస్పీ రాజశేఖర్‌రాజు

రైలు దోపిడీ దొంగ అరెస్టు

రూ.5.76 లక్షల బంగారు ఆభరణాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, దొంగ వివరాలు తెలియజేస్తున్న రైల్వే పోలీసులు

చిత్తూరు రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రైలు దోపిడీ దొంగను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.5.76 లక్షల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం చిత్తూరు రైల్వేస్టేషన్‌లో రేణిగుంట రైల్వే సీఐ యతీంద్ర మీడియాకు వివరాలను తెలిపారు. ఈనెల ఆరో తేదీన తిరుపతి నుంచి మదనపల్లెకు వెళ్తున్న రైలులో తిరుపతికి చెందిన కవిత(35) ప్రయాణిస్తున్నారు. రైలు పాకాల సమీపంలో వెళ్తుండగా ఇద్దరు గుర్తుతెలియని దొంగలు ఆమెపై కత్తితో దాడి చేసి.. మెడలో ఉన్న బంగారు మంగళసూత్రం, మరో బంగారు చైనును మొత్తం 64 గ్రాముల ఆభరణాలను దోచుకెళ్లారు. ఈ ఘటనపై ఆమె రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుంతకల్ రైల్వే ఎస్పీ రాహుల్ మీనా, తిరుపతి డీఎస్ఆర్పీ హర్షిత, నెల్లూరు డీఎస్ఆర్పీ మురళీధర్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. దర్యాప్తులో భాగంగా సాంకేతిక పరిజ్ఞాన్ని ఉపయోగించి సోమవారం దొంగను అరెస్టు చేశారు. నిందితుడిని శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం వై.కొత్తపల్లి గ్రామానికి చెందిన నారాయణ కుమారుడు పవన్‌కుమార్(26)గా గుర్తించారు. అతడి వద్ద నుంచి తాళిబొట్టు చైను(40) గ్రాములతోపాటు బంగారు గిన్నె బొట్లు 3, బంగారు లక్ష్మీకాసులు 2, బంగారు ద్రాక్షగుత్తి 1, బంగారుగుండ్లు 2.. అన్నీ కలిపి సుమారు 10 గ్రాములు, డాలర్ చైను 12 గ్రాములు మొత్తం రూ.5.76 లక్షల విలువైన 64 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీసులు పాల్గొన్నారు.

9 రోజుల్లో 5.53 లక్షల మంది ప్రయాణం

● మహిళలకు రూ.2.33 కోట్ల లబ్ధి



ఆర్టీసీ బస్టాండులో రద్దీ

చిత్తూరు రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్త్రీశక్తి పథకంతో కుటుంబాల్లో ఆర్థిక భరోసా లభిస్తోందని మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు 15న సాయంత్రం ఐదు గంటలకు సీఎం చంద్రబాబు ఈ పథకాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి 24వ తేదీ వరకు జిల్లాలో 5,53,534 మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. ఈ ప్రయాణ టికెట్ ఖర్చు వారికి రూ.2.33 కోట్లు ఆదా అయ్యింది. జిల్లాలో మొత్తం ఐదు డిపోలు ఉన్నాయి. చిత్తూరు-1లో 88, చిత్తూరు-2లో 104, పలమనేరులో 61, పుంగనూరులో 85, కుప్పంలో 123 కలిపి 461 బస్సులున్నాయి. ఇందులో 316 బస్సుల్లోనే ప్రయాణం ఉచితం చేసింది ప్రభుత్వం. ఇందులో పల్లెవెలుగు-281, ఎక్స్‌ప్రెస్-107 కలిపి మొత్తం 388 బస్సులున్నాయి. ఇందులోకూడా అంతర్రాష్ట్ర సర్వీసులు 72 పోను 316 బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అధికారులు అనుమతించారు.

కాణిపాకం సర్వీసులకు పెరిగిన ప్రయాణికుల సంఖ్య

ఉచిత సర్వీసుల మొదలైనప్పటి నుంచి మిగిలిన చోట్లతో పోలిస్తే కాణిపాకం సర్వీసుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగిందని డీపీటీవో రాము తెలిపారు. ఈ నెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్న కాణిపాక బ్రహ్మోత్సవాలకు బస్సుల సంఖ్య పెంచనున్నామన్నారు. ప్రత్యేకించి చవితి రోజున 12 సర్వీసులు, పుష్పపల్లకి సేవకు, రథోత్సవం రోజున 10 సర్వీసుల చొప్పున తిప్పనున్నట్లు ఆయన తెలిపారు.

కుప్పంలో రెండు ఇండస్ట్రియల్ పార్కులు

● మౌలిక వసతుల కల్పనకు చర్యలు ● వాణిజ్య, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్



సమీక్షిస్తున్న వాణిజ్య పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్, కలెక్టర్ సుమిత్ కుమార్ తదితరులు

కుప్పం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో రెండు ఇండస్ట్రియల్ పార్కులకు ప్రభుత్వ ఆమోదం లభించిందని రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ తెలిపారు. కడా కార్యాలయంలో సోమవారం ఆయన జిల్లా పరిశ్రమల స్థాపన, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్‌లతో సమీక్షించారు. ఈ సందర్భంగా యువరాజ్ మాట్లాడుతూ కుప్పం ప్రాంత అభివృద్ధి సంస్థ (కడా) కింద కుప్పంలో పారిశ్రామిక యూనిట్లు సాధించడానికి రెండు కంపెనీలకు భూమిని కేటాయించామన్నారు. ఒకటి శాంతిపురం, రామకుప్పం మండలాల పరిధిలో ఏర్పాటు కానున్న విమానాశ్రయం ప్రాంతంలో, మరొకటి గుడుపల్లె మండలం పొగురుపల్లె సమీపంలో వస్తున్నాయన్నారు. ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అందుకు ఏర్పాట్లు ముమ్మరం చేయాలన్నారు. అంతేకాక శాంతిపురం మండల పరిధిలోని ఓ పాల ఉత్పత్తి, మరో పశుగ్రాస ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్‌కు అనుగుణంగా ఏర్పాటు కానున్న పారిశ్రామిక వాడలు, పలు పరిశ్రమలు పేదరిక నిర్మూలనలో భాగం కానున్నాయన్నారు. ఈ పారిశ్రామిక వాడలతో కుప్పం ప్రజలు తగిన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా శ్రద్ధ చూపడంతోనే కుప్పం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు. అనంతరం కడా పీడీ వికాస్ మర్మత్ మాట్లాడుతూ కుప్పంలో ఏర్పాటు కానున్న పరిశ్రమలతో తొలి విడతలోనే 8 వేల ఉద్యోగాలు స్థానిక యువతకు లభిస్తాయని చెప్పారు. పరోక్షంగా మరెన్నో కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని, అంతిమంగా పేదరిక నిర్మూలన లక్ష్యం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో కుప్పం ఆర్డీవో శ్రీనివాసరాజు, ఇండస్ట్రీ జీఎం సూరిబాబు, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

అవరోధాలు అధిగమిస్తేనే లక్ష్య సాధన



కేఈంసీలో తరగతులు ప్రారంభిస్తున్న బీసీఎన్ తదితరులు

కుప్పం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మార్గమధ్యంలో ఎదురయ్యే అవరోధాలను అధిగమిస్తేనే అనుకున్న లక్ష్యాన్ని సాధించి విజయతీరాలు చేరుకోగలమని బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ.నాగరాజ్, వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్ అన్నారు. కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సర తరగతులను సోమవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ లక్ష్యానికి సులువైన మార్గం కష్టపడడమేనన్నారు. ఆత్మవిశ్వాసంతో అవరోధాలు అధిగమించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు బీటెక్ కోర్సులు పూర్తి చేసి అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి కుప్పం ఇంజనీరింగ్ కళాశాలను ఎన్నుకోవడం సంతోషకరమన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టేలా ఉన్నత విద్యాబోధన ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్ నాగప్రసాద్ , కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతి జె.మాధవన్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, పీఆర్వో ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ ఆలయ కుంభాభిషేకం



దిగువవీధి గంగమ్మ ఆలయం వద్ద చండీహోమం

రామకుప్పం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ ప్రధాన గ్రామదేవత దిగువవీధి గంగమ్మ ఆలయ కుంభాభిషేక మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఉదయం వేదపండితులు సందీప్‌శర్మ, నాగరాజశర్మల బృందం అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. తర్వాత కలశారాధన, మహాచండీయాగం చేపట్టారు. యాగం పూర్ణాహుతి అనంతరం ఆలయ గోపురంపై కలశ ప్రతిష్ఠాపన, కుంభాభిషేకం చేశారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సాగర్‌రెడ్డి, నరసింహులు, రవికుమార్, టైలర్‌సురేష్, పెదబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి, క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి, బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రాజసింహా, నేతలు గుర్రప్ప, వెంకటరమణ, కామరాజనాయక్, బాలరాజు, సుబ్రీ, మంజునాథ్, అవినాశ్, ఆదిల్, సురేష్, మురళీ, శంకర్, గోపి, భక్తులు పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ ప్రభాకర్

గంగవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవతి పండుగను పురస్కరించుకొని వర్గాలుగా విడిపోయి గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ హెచ్చరించారు. గత ఏడాది వినాయక చవతి సందర్భంగా గొడవలకు పాల్పడి కేసులు నమోదైన వారికి సోమవారం పలమనేరులోని డీఎస్పీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. వినాయక చవతిని ఎవరికీ ఇబ్బంది లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. పాత కక్షలు మనసులో పెట్టుకొని ఎవరైనా గొడవలకు, వర్గ విబేధాలకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ప్రత్యక్షంగా గాని.. పరోక్షంగా కారకులైతే అలాంటి ఉపేక్షించేది లేదని, ఎంతటి వారైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



మంగళంపేట సచివాలయానికి అంబేడ్కర్ చిత్రపటాన్ని అందిస్తున్న నాయకులు

కల్లూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అంబేడ్కర్ సేవాసమితి అధ్యక్షులు గురుస్వామి తెలిపారు. పులిచెర్ల మండలంలోని 14 సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయం, కల్లూరు పోలీసు సర్కిల్ కార్యాలయానికి సోమవారం అంబేడ్కర్ సేవాసమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం భారత రాజ్యాంగాన్ని రూపకల్పన చేసిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అన్నారు. దళిత నాయకుడు క్రాంతికుమార్, నారాయణ, రాధాకృష్ణ, శ్రీనివాసులు, జ్యోతీష్‌కుమార్, సహదేవయ్య, అభిరామ్ పాల్గొన్నారు.

గణేశ్ మండపాలకు అనుమతులు తప్పనిసరి

సదుం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో వినాయక విగ్రహాల మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని ఎస్‌ఐ షేక్ షావలి సోమవారం తెలిపారు. అనుమతి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో గాని.. స్టేషన్ సిబ్బంది నుంచి పొందొచ్చని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉత్సవాలు నిర్వహించరాదని ఆయన సూచించారు.

ప్రతిభావంతులకు ప్రత్యేక గుర్తింపు



ట్రైసైకిళ్లను అందజేస్తున్న ప్రత్యేక ప్రతిభావంతుల ఏడీ వినోద్

పుంగనూరు రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ప్రతిభావంతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు ఇస్తోందని ఏడీ వినోద్ అన్నారు. సోమవారం స్థానిక బసవరాజ ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో దాదాపుగా 479 మందికి బ్యాటరీ సైకిళ్లు, వినికిడి పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ రాజశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కోసమే బీజేపీపై కాంగ్రెస్ విమర్శలు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పుంగనూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో ఉనికి చాటుకోవడానికే కాంగ్రెస్ పార్టీ ఓట్లు చోరీ అంటూ బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నట్లు పుంగనూరు బీజేపీ నాయకులు ఆరోపించారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ఓటు చోర్ గద్దె చోడ్ అనే కార్యక్రమం కేవలం ప్రజలు కాంగ్రెస్ పార్టీని మరిచిపోవడంతో తాము ఉన్నామంటూ ఉనికి చాటుకోవడానికే అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక పోతున్నారని, ఏవైనా ఆధారాలతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయాలే తప్ప.. తప్పుడు ప్రచారం చేయరాదన్నారు. సమావేశంలో నాయకులు జగదీష్‌రాజు, పెద్దమఠంబాబు, వెంకటరెడ్డి, చంద్రరాజు, ఉమామహేష్, రమేశ్, రెడ్డికుమార్, సుబ్రహ్మణ్యంరాజు, హర్షవర్ధన్ రాజు, దిలీప్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి

సోమల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో టీడీపీ బలోపేతానికి కృషి చేస్తామని సింగిల్‌విండో చైర్మన్ శివశంకర్ అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ప్రమాణ స్వీకరణ అనంతరం తొలిసారి కలుసుకుని పలువురు టీడీపీ నాయకులు సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో సీఈవో రెడ్డెప్ప, నాయకులు మహేంద్రబాబు, శెట్టివారి సురేంద్రబాబు, మధుసూదన్, రాగ్గారి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సుబ్బరాయుడు

పుంగనూరు రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని పుంగనూరు సీఐ సుబ్బరాయుడు సూచించారు. సోమవారం స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పిల్లలు ఉన్నత స్థానంలో ఉండాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు కళాశాలలకు పంపుతున్నారని తెలిపారు. తల్లిదండ్రుల ఆశయాలను పిల్లలు నెరవేర్చాల్సిన బాధ్యత ఉందన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు లోనైతే అది వ్యసనంగా తయారై ఆరోగ్యంతోపాటు బంగారు భవిష్యత్తు కోల్పోతారని వివరించారు. సమావేశంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు రాజశేఖర్, అనిల్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాదుస్తుల పంపిణీ



విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న శరత్ చంద్ర

చౌడేపల్లె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చారాల హైస్కూల్‌లోని విద్యార్థులకు అదే పాఠశాలలో పనిచేసే సైన్స్ ఉపాధ్యాయుడు శరత్‌చంద్ర సోమవారం హెచ్ఎం రేణుకా చేతుల మీదుగా క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పీడీ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

సోమల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అక్కదేవతల ఆలయ భూమి ఆక్రమణకు గురైందని గట్టువారిపల్లె గ్రామస్తులు తహసీల్దార్ మధుసూదన్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలువురు రైతులు తమ ఖాతాలోని భూముల వివరాలు సక్రమంగా ఉన్నా వెబ్‌ల్యాండ్‌లో నమోదు కావడం లేదని అర్జీలు అందజేశారు. అలాగే ఇరికిపెంటలో తాతయ్యకు చెందిన ఇంటి స్థలాన్ని మరో వ్యక్తి పట్టాపొందాడని తమకు న్యాయం చేయాలన్నారు. బుంగావారిపల్లెలో వినాయక విగ్రహ ప్రతిష్ఠకు ప్రభుత్వ స్థలంలో ఏర్పాటుకు సహకరించాలని తహసీల్దార్‌కు విన్నవించారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం



శ్రీరాములు కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ఎస్.గొల్లపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త శ్రీరాములు సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్, మాజీ వైస్‌చైర్మన్ గంట్లప్పగౌడ స్థానిక నేతలతో కలిసి శ్రీరాములు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మృతుడికి కుటుంబసభ్యులకు వారు పార్టీ తరపున రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

ఘనంగా చెన్నరాయస్వామి కల్యాణం



అలంకరణలో భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీ చెన్నరాయస్వామి

గంగవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సరమట్లపల్లె గ్రామంలో వెలసిన చెన్నరాయస్వామి వారి కల్యాణోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. చెన్నరాయస్వామి, భూదేవి, శ్రీదేవి లక్ష్మీలకు ప్రత్యేక అలంకరణ చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి వారిని పుష్పపల్లకీపై ఊరేగించారు.

పలమనేరు విద్యార్థుల ప్రతిభ



సీఏ కాన్వకేషన్లు అందుకున్న రిషబ్, శశి శ్రీనివాస్

గంగవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పలమనేరుకు చెందిన రిషబ్, శశి శ్రీనివాస్‌లు సోమవారం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో సీఏ కాన్వకేషన్లు అందుకున్నారు. ఇప్పటికే వీరిద్దరూ సీఏ, సీఎంఏలో ఆరు నేషనల్ ర్యాంకులు, ఇంటర్‌లో స్టేట్ ర్యాంకులు, పదో తరగతిలో ఆలిండియా ర్యాంకులు సాధించారు. రాష్ట్రపతి నుంచి ఇద్దరూ అవార్డులు పొంది జాతీయస్థాయిలో పలమనేరు ఖ్యాతిని నెలబెట్టారని పలువురు ప్రశంసించారు.

మట్టి వినాయకుడి బొమ్మలే ఏర్పాటు చేసుకోవాలి

పుంగనూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణంలో మట్టి వినాయక బొమ్మలనే ఏర్పాటు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయడంతో వాతావరణ కాలుష్యం, నీటి కాలుష్యం నివారించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

రైతు బాంధవుడు చంద్రబాబు

రామకుప్పం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గ ప్రజలకిచ్చిన మాట ప్రకారం హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలను అందించిన సీఎం చంద్రబాబు మరోసారి రైతుబాంధవుడని నిరూపించుకున్నారని తెలుగు రైతు కుప్పం నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి తెలిపారు. సోమవారం రామకుప్పంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అనాదిగా కరువు కాటకాలతో సతమతమవుతున్న కుప్పం రైతాంగం బాధలను స్వయంగా తెలుసుకున్న చంద్రబాబు రూ.545 కోట్ల వ్యయంతో 800 కిలోమీటర్ల దూరం నుంచి హంద్రీ-నీవా ప్రాజెక్టు ద్వారా కుప్పానికి కృష్ణాజలాలు తీసుకొచ్చి రైతుల్లో ఆనందం నింపారని తెలిపారు.

రసాభాసగా మండల సమావేశం

● వైసీపీ ఎంపీటీసీల మాటలకు స్పందించిన ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రెడ్డెప్ప

పెద్దపంజాణి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన మండల సమావేశం రసాభాసగా సాగింది. ఎలాంటి అభివృద్ధి పనులపై చర్చలు లేకుండానే సమావేశం ముగిసింది. ఏడాది కాలంలో జరిగిన పనుల్లో రూ.కోటి అవినీతి జరిగిందని.. ఇందుకు సమాధానం చెప్పాలని వైసీపీ ఎంపీటీసీలు నిలదీశారు. ఇందుకు స్పందించిన వీరప్పల్లె ఎంపీటీసీ సభ్యులు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వైసీపీ ఎంపీటీసీల మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన సమావేశాల్లో ఉన్న ఒకే ఒక్క టీడీపీ ఎంపీటీసి సభ్యుడికి గౌరవమైనా ఇచ్చారా.. అభివృద్ధి కార్యక్రమాల గురించి కనీసం మాట్లాడనిచ్చారా అని నిలదీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్రంలో ఆదర్శవంతమైన అభివృద్ధి జరుగుతోందని .. అలాగే ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పలమనేరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని.. అభివృద్ధిని చూసి ఓర్వలేక గత రెండు సమావేశాలు బహిష్కరించి .. ఇప్పుడు సభ్యత్వం కోల్పోతామనే భయంతో సమావేశానికి హాజరై ఇష్టారాజ్యంగా మాట్లాడటం తగదన్నారు. గత ప్రభుత్వంలో గాలిలో అభివృద్ధి చేసి పేపర్లపై బిల్లులు చేసుకొని మండలాన్ని అంధకారంలోకి నెట్టింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. సభా మర్యాదలు పాటించరు.. ప్రొటోకాల్ పాటించరు.. అంతా అవినీతిమయం పాలన అందించి దొరికిన కాడికి దోచుకున్నారన్నారు. కనీసం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు దళితుడిననే కారణంతో దూరం పెట్టింది వాస్తవం కాదా అన్నారు. వైసీపీకి చెందిన వారు తనపై తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై ఎంపీపీ రెడ్డెప్ప స్పందించారు. చేయని తప్పునకు బలిపశువును చేసి పార్టీ నుంచి సస్పెండ్ చేశారు.. నిజాన్ని నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్నారు. మనస్థాపానికి గురైన ఎంపీపీ సమావేశాన్ని అర్థాంతరంగా ముగిస్తున్నాని తెలిపారు. సమావేశానికి ఇన్‌చార్జి ఎంపీడీవో శారదాదేవి, తహసీల్దారు హనుమంతు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీటీసీలు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడానికే అన్న క్యాంటీన్లు

● ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నేతలు

శాంతిపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పేదవాడి ఆకలి తీర్చడానికే అన్న క్యాంటీన్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి పీఎంకే ఉడా చైర్మన్ సురేష్‌బాబు, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం అన్నారు. సోమవారం శాంతిపురంలోని వ్యవసాయ కార్యాలయ ఆవరణలో అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందించిన ఘనత దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌దేనన్నారు. ఆయన ఆశయాలను నెరవేర్చాలని సీఎం చంద్రబాబు నాయుడు పథకాలను కొనసాగిస్తూ అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశారన్నారు. వంలు ఖర్చు చేసి ఆకలి తీర్చుకోలేని పేదవాడికి కడుపు మండి 2024 ఎన్నికల్లో 11 సీట్లకే వైసీపీని పరిమితం చేశారన్నారు. ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీల మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే 120 అన్న క్యాంటీన్లను ప్రారంభించి పేదల ఆకలి తీర్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదేనన్నారు. ఐదు సంవత్సరాల్లో రాష్ట్రంలోని అన్ని మండలాల్లోనూ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు బాష్యం విశ్వనాథనాయుడు, మాజీ మండల వైస్ ఎంపీపీ నందిగం ఉదయకుమార్‌నాయుడు, టీటీడీ బోర్డు సభ్యులు శాంతారాం, సింగల్ విండో చైర్మన్ గోపాల్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, రాళ్లబూదుగూరు మాజీ క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ ఆర్ నాగరాజు, శాంతిపురం క్లస్టర్ ఇన్‌చార్జి రాజేంద్ర, ఏఎంసీ డైరెక్టర్ శ్యామల, యూనిట్ ఇన్‌చార్జిలు పెద్దన్న, గిరిధర్, బాలు, మండల వాణిజ్య వాభాగం అధ్యక్షులు మురళీ, టీడీపీ నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, సింగిరి శ్రీనివాసులు, జయపాల్, తుమ్మిశి శేఖర్, మంజునాథ్, రాజారెడ్డి, ఈడిగ రమేష్, పాలు శివ, రమష్, సూరి, వెంకటపతి, కేదరనాథ్, శ్రీనివాసులరెడ్డి, కోదండ, మహిళ నేతలు, రూప, హేమావతి, పోలారాణి, సరిత, పంచాయతీ కార్యదర్శి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాలకు హారతి



గుడుపల్లె మండలం కుప్పిగానిపల్లె వద్ద హంద్రీ-నీవా కాలువ

గుడుపల్లె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : గుడుపల్లె ఉన్నత పాఠశాల సమీపంలోని హంద్రీ-నీవా కాలువలో కృష్ణా జలాలకు టీడీపీ మండలాధ్యక్షుడు బాబునాయుడు, ఏఎంసీ చైర్మన్ బీఎం రాజు, కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్ జల హారతులు ఇచ్చారు. రెస్కో చైర్మన్ ప్రతాప్, సింగిల్ విండో చైర్మన్ రమేష్, జనసేన మండలాధ్యక్షుడు అమీర్, నేతలు బేటప్పనాయుడు, హేమంబర్‌గౌడు, వెంకటేష్, భానుమూర్తి, ఎల్లప్ప, ప్రకాష్, సుబ్రహ్మణ్యం, మంజునాథ్, గోపాల్, గోవిందస్వామి, మునివెంకటప్ప, గోపి, ఉదయకుమార్ పాల్గొన్నారు.

● కరువు తీరిందాది పోప్పా



ఈ నీళ్లతో కరువు తీరిందాది పోప్పా. గంగమ్మ తల్లికి మించిన బాగ్యం ఏంగావాల మాకు? కళ్లముందర ఇన్నినీళ్లు పోతావుండేది చూస్తావుంటే కడుపు నిండిపోతా వుండాది. రాబోయే కాలంలో మా కడుపులు కాలేది లేదు. మా బూముల నిండా బంగారు పంటలే. మూడునాలుగు నెలలో చేలో కష్టపడితే.. తినేకి పెట్టుకుని, అమ్ముకునేది అమ్ముకుంటే కడుపులో చల్ల కదలకుండా బతికెయ్యొచ్చు.

\- ఏజీ.గంట్లరెడ్డి, కెంపసముద్రం, రామకుప్పంమండలం

● ఏందో అనుకున్నగానీ..

ఎక్కడో శ్రీశైలంనించా నీళ్లు వొస్తాయని సెంద్రబాబు చెప్తావుంటే ఇదయ్యేదా పొయ్యేదా అనుకున్నా. కానీ చెప్పిన పని చేసి చూపెట్టినాడాయప్ప. నాకు ఆరెకరాల సేద్యముండాది. నాలుగైదు బోర్లు ఏసినా, ఒకట్రెండు బోర్లలో ఉచ్చలా కారతావుండాయి నీళ్లు. సేద్యం మానుకోని ఉండాల్సిందే. అయితే ఇప్పుడు కాలవ నిండా నీళ్లు. చెరువులు కూడా నింపతారంట గదా. బోర్లన్నీ రీచార్జి అవతాయి. ఇంగ సేద్యానికి దిగులే పళ్లేదు.

\- రామకృష్ణారెడ్డి, చిన్నారిదొడ్డి, శాంతిపురం

శిథిలమైన ఆలయాల అభివృద్ధికి సహకరించాలి



పురాతన భసవేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఆలయ వంశీకులు, కురబ కుల సంఘం నేతలు

శాంతిపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మఠం గ్రామ సమీపంలో శిథిలమైన భసవేశ్వరస్వామి, సిద్దేశ్వరస్వామి, బీరేశ్వరస్వామి ఆలయాల పునర్నిర్మాణానికి అధికారులు సహకారం అందించాలని రాష్ట్ర కురబ కుల కార్పోరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, కడా అడ్వైజర్ కమిటీ సభ్యులు రామచంద్రన్, కదిరప్ప, మండల కురబ కుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ కోరారు. సోమవారం ఆలయాల వంశీకులు, నియోజకవర్గ కురబ కుల సంఘం నేతలు శిథిలమైన ఆలయాల వద్దకు వెళ్లి శుభ్రపరిచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తహసీల్దారు శివయ్యను కలిసి ఆలయ ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయని.. ఆలయాల అభివృద్ధికి సహకరించాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల కురబ కుల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటపతి, ఐటీడీపీ పార్లమెంట్ సభ్యులు మంజునాథ్, బీరేష్, మునెప్ప, రామగౌడు, బీరప్ప, గణష్, పార్థు, ప్రసాద్, బాలు, కుప్పం ఏరియా ఆస్పత్రి కమిటీ సభ్యులు మంజునాథ్, కుల సంఘం పెద్దలు పాల్గొన్నారు.

మాదిగకుంట చెరువు ఆక్రమణలపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న కుమార్‌రెడ్డి

చౌడేపల్లె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మాదిగకుంట చెరువు ఆక్రమణలపై తహసీల్దార్ పార్వతికి న్యాయవాది కుమార్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. మాదిగకుంట చెరువును ఆక్రమించి పంటల సాగు చేస్తున్నారని.. పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని.. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన తహసీల్దారు మాట్లాడుతూ వరిపైరు నాటిన చోట బోర్డును ఏర్పాటు చేశామని.. ఆక్రమణలు తొలగించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తే లైసెన్స్ రద్దు



దుకాణాలను తనిఖీ చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

పుంగనూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని దుకాణ యజమానులు నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తే దుకాణ లైసెన్స్‌లు రద్దు చేస్తామని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ మునివెంకటప్ప మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు దుకాణాలపై దాడులు నిర్వహించి ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తున్న దుకాణ యజమానులకు జరిమానాలు విధించి ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. రెండోసారి ప్లాస్టిక్ వస్తువులు లభిస్తే లైసెన్స్ రద్దు చేయనున్నట్లు హెచ్చరించారు.

వినాయక చవితిని ప్రశాంతంగా నిర్వహించాలి

చౌడేపల్లె, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి):వినాయక చవితి పర్వదినాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరు సహకరించాలని ఎస్‌ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన మండలంలోని హిందూ, ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినాన్ని ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు అందరూ సహకరించాలని కోరారు.

ఆటో బోల్తా : ఐదుగురికి గాయాలు

పుంగనూరు రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు- మదనపల్లె మార్గంలోని రాంపల్లె వద్ద సోమవారం ఆటోబోల్తా పడి ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా.. పుంగనూరు మండలం నేతిగుట్లపల్లెకు చెందిన చిన్నప్ప కుమారుడు మహేశ్వర్(36), ఈశ్వరమ్మ(35), వీరమ్మ(65), కీర్తన(15)లు ఆటోలో పుంగనూరు వారపు సంతకు వస్తుండగా రాంపల్లె వద్ద కుక్కను తప్పించబోయి ఆటోబోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ కుమారస్వామితో పాటు నలుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని అదే ఆటోలో పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు.

వైసీపీ నేత నుంచి మా భూమిని కాపాడండి

● బాధితులైన దంపతుల విజ్ఞప్తి


మీడియాతో మాట్లాడుతున్న కృష్ణయ్య, నాగమోహిని దంపతులు

శ్రీరంగరాజపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత నుంచి తమ భూమిని కాపాడాలని ఎగువకమ్మకండ్రిగ గ్రామ పంచాయతీ మిట్టహరిజనవాడకు చెందిన కృష్ణయ్య, నాగమోహిని దంపతులు విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు మీడియాకు వివరాలు తెలిపారు. మిట్టహరిజనవాడలోని సర్వే నెంబరు 130/2ఐలో ఎకరా ఆరు సెంట్ల భూమిని 1999లో పుల్లూరు గ్రామానికి చెందిన వంక నరసింహులు వద్ద కొని, నాగమోహిని పేరుతో రిజిస్టర్ కూడా చేసుకున్నారు. అయితే మిట్టహరిజనవాడకు చెందిన వైసీపీ నేత ఏకాంబరం.. ఆ భూమిని తన భార్య అంజలిపై 2018లో తహసీల్దార్ సంతకం ఫోర్జరీ చేసి, తప్పుడు పత్రాలు సృష్టించాడని బాధితులు ఆరోపించారు. అడిగితే దౌర్జన్యం చేస్తున్నాడని చెప్పారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. ఇకనైనా రెవెన్యూ అధికారులు విచారించి న్యాయం చేయాలని కోరారు.

సమస్యలను త్వరగా పరిష్కరించాలి: కమిషనర్


బాధితుడి నుంచి అర్జీ స్వీకరిస్తున్న నరసింహప్రసాద్

చిత్తూరు అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ నరసింహప్రసాద్ ఆదేశించారు. సోమవారం పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమాన్ని నిర్వహించారు. బాధితుల నుంచి అర్జీలను స్వీకరించి, సిబ్బందితో సమీక్షించారు. పింఛన్లకు 9, ఇంజనీరింగ్‌కు 3, పబ్లిక్‌హెల్త్‌కు ఒక్క అర్జీ చొప్పున మొత్తం 13 అర్జీలు వచ్చాయి. సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంహెచ్‌వో లోకేష్, ఏసీపీ నాగేంద్ర, ఎంఈ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటిలో నానుతున్న పంటల పరిశీలన


బాధిత రైతులతో కలిసి పంటను పరిశీలిస్తున్న రెడ్డెప్ప

గంగాధరనెల్లూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వేరుశనగపంటలపై తూగుండ్రం చెరువు మొరవ నీళ్లు పారడాన్ని సోమవారం బాధిత రైతులు, టీడీపీనేతలతో కలిసి వ్యవసాయశాఖ అసిస్టెంట్ రెడ్డెప్ప పరిశీలించారు. 'దెబ్బతిందా.. రాళ్లు తొలగించారా..?' శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఏవో భవాని ఆదేశాలతో రెడ్డెప్ప నీటిలో నానుతున్న పంటలను పరిశీలించారు. చంద్రబాబురెడ్డి, నీరజాక్షులురెడ్డి, జయరాం మొదలి, శేఖర్ మొదలి, మురుగేష్ మొదలి, చిరంజీవిరెడ్డి, మహేష్ మొదలి, రీటా రైతుల సాగుచేసిన వేరుశనగ పంటలకు నష్టం వాటిల్లుతోందని నివేదికలు పంపనున్నట్లు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ తెలిపారు. పార్లమెంట్ టీఎన్‌టీయూసీ అధికార ప్రతినిధి జీవరత్నం, తూగుండ్రం గ్రామ కమిటీ టీడీపీ అధ్యక్షుడు నీరజాక్షులురెడ్డి, నేత రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బాల్య వివాహాలు చేస్తే శిక్ష తప్పదు


సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ సెక్రటరీ భారతి

పూతలపట్టు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చేస్తే శిక్షణ తప్పదని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, న్యాయమూర్తి భారతి హెచ్చరించారు. సోమవారం పూతలపట్టు ఉన్నత పాఠశాల ఆవరణలో బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అమ్మేపల్లె ప్రాథమిక పాఠశాలలోనూ బాల్యవివాహాలపై అవగాహన సదస్సు జరిగింది. డీపీవో సుధాకర రావు, స్కూల్ కమిటీ చైర్మన్ నేతాజి, టీడీపీ నేత మురళి, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయవాడ మహాధర్నాలో కార్వేటినగరం టీచర్లు



వెదురుకుప్పం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పాత పింఛను అమలు చేయాలంటూ సోమవారం విజయవాడలో జరిగిన మహాధర్నాలో కార్వేటినగరం టీచర్లు హాజరయ్యారు. వీరిలో.. 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల ఫోరం డివిజనల్ కన్వీనర్ చల్లంపాళ్యం వెంకటేశ్వర్లు, నాయకులు ఉన్నారు.

నగరిలో విజయ్‌కాంత్‌కు నివాళి



నగరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన డీఎండీకే వ్యవస్థాపకుడు, సినీనటుడు విజయ్‌కాంత్ జయంతి సందర్భంగా నగరిలో సోమవారం ఆయన అభిమానులు నివాళి అర్పించారు. కొత్తపేటలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, కేక్ కట్ చేసి పంచి పెట్టారు. పేదలకు అన్నదానం చేశారు.

సర్పంచులు, ఎంపీటీసీల డుమ్మా

● పెనుమూరు మండల సర్వసభ్య సమావేశం పరిస్థితిదీ..!


ఖాళీగా ఉన్న కుర్చీలు

పెనుమూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండల సర్వసభ్య సమావేశానికి పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు డుమ్మా కొట్టారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ హేమలత అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో 25 పంచాయతీలకు కేవలం నలుగురు సర్పంచులే హాజరయ్యారు. ఎంపీటీసీలు 12 మంది ఉంటే.. ఆరుగురు మాత్రమే వచ్చారు. హాజరైనవారు కూడా సమస్యలపై నోరు మెదపలేదు. ఏపీఎం చిరంజీవితో ఎంపీపీ మాట్లాడుతూ.. వెలుగులో అకౌంటెంట్‌ను ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ఆయన బదులిస్తూ.. మార్చులో సుమారు రూ.40 లక్షల అవకతవకలు జరిగాయని, జిల్లా అధికారుల ఆదేశాలతో నలుగురు సిబ్బందిని తొలగించి, వారి స్థానంలో కొత్తవారిని తీసుకున్నామని వివరించారు. మినీ గోకులం షెడ్ల నిర్మాణాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులనూ ఎంపీపీ ఆరా తీశారు. మామిడి రైతులకు త్వరలో ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం విడుదల చేస్తుందని వ్యవసాయాధికారి సుహర్లత తెలిపారు. తహసీల్దారు శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. మండలంలో జారీచేసిన కుల ధ్రువీకరణ పత్రాలపై సుమోటాగా విచారణ జరపాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఎంపీడీవో కిషోర్, సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శ్రీధర్‌బబాబు, ఎస్ఐ వెంకటనరసింహం, ఏఈలు రమేష్‌బాబు, తులసిప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో ప్రభుకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రింటర్ల దొంగ అరెస్టు


పోలీసుల అదుపులో నిందితుడు

వెదురుకుప్పం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రింటర్ల దొంగను అరెస్టు చేశారు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. కొమరగుంట రైతు సేవా కేంద్రంలో ఈనెల ఏడో తేదీన రెండు ప్రింటర్లు చోరీ అయ్యాయి. ఈ కేసులో నిందితుడైన పచ్చికాపల్లం కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు మురళిని అరెస్టు చేసి సోమవారం రిమాండుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

28న దుకాణాల వేలం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కోదండ రామాలయం వాణిజ్య సముదాయంలో రెండు దుకాణాలకు, చర్చివీధిలోని వాహన మండపంలో ఒకటి, పిళ్లారి గుడి వీధి మరో దుకాణానికి ఈనెల 28వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ ఈవో సుబ్రహ్మణ్యంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

విగ్రహాల ప్రతిష్ఠ: గిరింపేట దుర్గానగర్ కాలనీ సర్వసిద్ధి వినాయక ఆలయ ప్రాంగణంలో ఈనెల 28వ తేదీన శ్రీరామ పరివార విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు తెలిపారు.

డీసీసీబీ సేవలపై అవగాహన

శ్రీరంగరాజపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీ సేవలపై ఖాతాదారులకు ఎస్ఆర్‌పురంలోని సింగిల్ విండో కార్యాలయంలో అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. బ్రాంచి మేనేజర్ డి.ఎస్.వహీదా, సింగిల్ విండో సీఈవో రాజారెడ్డి, సూపర్‌వైజర్ ఢిల్లీబాబు పాల్గొన్నారు.


ఫ్యాక్టరీకి ఆనుకుని ఉన్న కాలువలోకి కెమికల్ వ్యర్థాలు - ఫ్యాక్టరీ స్థలంలో వదిలిపెడుతున్న వ్యర్థపునీరు - వంకలో కలుస్తున్న కెమికల్స్

భూగర్భ జలాలు కలుషితం

స్టీల్ ఫ్యాక్టరీ వ్యర్థాలే కారణమంటున్న శెట్టింతంగల్‌వాసులు

చిత్తూరు రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని శెట్టింతంగల్ వద్ద ఉన్న స్టీల్ ఫ్యాక్టరీ నుంచి వెలువడే వ్యర్థాలు, కెమికల్స్ కారణంగా పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫ్యాక్టరీ నుంచి వస్తున్న వ్యర్థాలను పక్కనే ఉన్న వంకలోనూ, ఎదురుగా ఉన్న అదే పరిశ్రమకు చెందిన స్థలంలోనూ వదిలిపెడుతున్నారని చెబుతున్నారు. వ్యర్థాలు భూగర్భంలోకి చేరడంతో బోరు నీళ్లు తాగిన వారికి చర్మవ్యాధులు సోకి అనారోగ్యం పాలవుతున్నారని వాపోయారు. పంటలు కూడా సరిగా పండటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లపై పరిశీలన


కట్టమంచి చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కట్టమంచి చెరువు వద్ద వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను సోమవారం నగరపాలక కమిషనరు నరసింహప్రసాద్ పరిశీలించారు. విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన నీరు, క్రేన్లు, భక్తుల రద్దీకి అనుగుణంగా బారికేడ్లు, లైటింగ్, తాగునీరు, మొబైల్ టాయ్‌లెట్స్ వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చెరువు కట్ట వద్ద ప్రజారోగ్య విభాగం చేపట్టిన పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఎంహెచ్‌వో లోకేష్, ఎంఈ వెంకటరామిరెడ్డి, డీఈ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

75 దొడ్డిపల్లెలో భారీ వినాయక విగ్రహం



చిత్తూరు కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 75 దొడ్డిపల్లెలో విజయ వినాయక ఉత్సవ కమిటీ వారు 40 అడుగుల భారీ మట్టి గణపయ్యను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా జరిగే ఉత్సవాల్లో స్థానికులు, పరిసర ప్రాంతాలవారు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఉత్సవ నిర్వాహణ కమిటీ సభ్యులు వి.రమేష్, ఈ.వంశీకృష్ణారెడ్డి, ఆర్.ప్రకాష్, వి.భానుప్రసాద్, జి.చెన్నశ్రీకాంత్, జి.జయప్రకాష్, ఎస్.నళినీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు 'చవితి' వేడుకలు


ఔషధ మొక్కలను ప్రదర్శించిన విద్యార్థులు

వెదురుకుప్పం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ముందస్తు వినాయక చవితి వేడుకలను ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణశారద ఆధ్వర్యంలో బోటనీ అధ్యాపకులు ఎల్ఎండీ భక్షు, సి.అరుణ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రతి పూజలో ఉపయోగించే ఔషధ మొక్కల ప్రదర్శనను ఏర్పాటు చేశారు.

మట్టి విగ్రహాలనే వాడండి

పాలసముద్రం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాలనే వాడాలని ప్రజలకు తహసీల్దార్ అరుణకుమారి సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులు, గణేష్ ఉత్సవ కమిటి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో విద్యావతి, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గణేశుడి మట్టి ప్రతిమల వితరణ



చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక మట్టి ప్రతిమలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని బీజేపీ సీనియర్ నేత చిట్టిబాబు అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని సోమవారం గిరింపేటలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మట్టి ప్రతిమలు వితరణ చేశారు. హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముళ్ల కంపలు తెచ్చిన తంటా

● ఇరువర్గాల మధ్య ఘర్షణ : కేసు నమోదు

వెదురుకుప్పం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎవరో ముళ్ల కంపలు వేయడం వల్ల ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి వ్యవహారం పోలీసుస్టేషన్‌కు చేరింది. పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ గోవిందస్వామి తెలిపిన ప్రకారం.. కార్వేటినగరం మండలం కేశవకుప్పం గ్రామ పంచాయతీ మర్రిమాకుల ఇళ్లకు చెందిన బాలకృష్ణంరాజు ఇంటి పక్కన పాండు మందడి పొలం ఉంది. ఆ పొలంలో ఎవరో ముళ్ల కంపలు వేశారు. ఈ కంపలను బాలకృష్ణంరాజు వేసి ఉంటాడని భావించిన పాండుమందడి వాదనకు దిగారు. ఇది కాస్తా ఘర్షణకు దారితీయడంతో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాలపైనా కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

'సూర్యఘర్'ను సద్వినియోగం చేసుకోండి

పాలసముద్రం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం కల్పలతారెడ్డి సూచించారు. సోమవారం వెలుగు కార్యాలయంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ పథకం కింద తమ ఇంటిపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లు తగ్గుతుందని చెప్పారు. ప్యానెళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీతోపాటు బ్యాంకులు శ్రీనిధి ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

ఎంపీతో థామస్ చర్చలు


ఎంపీ ప్రసాదరావుతో కలిసి స్వీటు స్వీకరించిన ప్రభుత్వ విప్ థామస్

వెదురుకుప్పం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావును ఆయన కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ వీఎం థామస్ సోమవారం కలిశారు. ఈ క్రమంలో ఎంపీని సత్కరించారు. తర్వాత జీడీనియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. వారివెంట తెలుగు మహిళా నాయకురాలు ఇందిర ఉన్నారు.

విద్యార్థులకు అభినందనలు



శ్రీరంగరాజపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆరిమాకుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వి.రేష్మ, టి.రక్షిత, యం.ఆకాష్‌లు షూటింగ్ బాల్ సబ్ జూనియర్స్ కేటగిరీలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం కళావతి తెలిపారు. విద్యార్థులను సోమవారం పాఠశాలలో పీటీ మాస్టర్ లోకనాథం, టీచర్లతో కలిసి అభినందించారు. ఈనెల 13, 14 తేదీల్లో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

నీవా వాగులో ఆక్రమణలు



యాదమరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జోడిచింతల వద్ద సమీపంలోని మాదిరెడ్డిపల్లె వద్ద నీవావాగులో పలుచోట్ల ఆక్రమణలు పెరిగిపోయాయి. మట్టి పూడికలతో ముందుకురావడంతో నీటి ప్రవాహం మూసుకుపోయే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు


సమావేశంలో ప్రసంగిస్తున్న సీఐ విక్రమ్

నగరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని సీఐ విక్రమ్ హెచ్చరించారు. నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహించిన ర్యాగింగ్ వ్యతిరేక సదస్సులో ఆయన ప్రసంగించారు. ఎస్ఐ తేజశ్విని మాట్లాడుతూ.. సెల్‌ఫోన్లలో వాట్సాప్ డీపీలుగా తమ ఫొటోలను పెట్టొదన్నారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

టీచర్లకు సన్మానం



వెదురుకుప్పం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కేఎం పురం జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళుతున్న టీచర్లను హెచ్‌ఎం డి.సునీత ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. సన్మానం అందుకున్న వారిలో పి.చంద్రశేఖర్, ఎం.రవి, వై.దామోదరం, కరీం, భాస్కర్, మోహమ్మద్ పరూఖ్, త్యాగరాజు, పట్టాభి ఉన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంచుకోండి

● విద్యార్థులకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సూచన



ఓరియంటేషన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాలను పెంచుకోవాలని విద్యార్థులకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సూచించారు. విజయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆడిటోరియంలో సోమవారం మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి అధ్యక్షతన ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా చదవడంతోపాటు ప్రతి అంశంపైనా పట్టు సాధించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం క్వాంటమ్ టెక్నాలజీ, ఏఐ విభాగాల్లో అవకాశాలను విద్యార్థుల ముంగిట ఉంచుతుందన్నారు. ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విజయం విద్యాసంస్థలు ఒక కల్పవృక్షమని ప్రశంసించారు. గ్రావిటీ వైస్ ప్రెసిడెంట్ ఏపీ శర్మ మాట్లాడుతూ.. సాంకేతికతపై పట్టు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, పారిశ్రామికవేత్త దామోదర నాయుడు, టీటీడీ బోర్డు మెంబర్ శాంతారాం, పీకేఎం ఉడా చైర్మన్ సురేష్ బాబు, విజయం అకడమిక్ డైరెక్టర్ శైలజమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ కెగోపి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

హుండీల లెక్కింపు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కట్టమంచి కులందేశ్వర, వరదరాజ స్వామి ఆలయాల హుండీల లెక్కింపులను ఈవో సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. కులందేశ్వర స్వామికి రూ.159,699, వరదరాజస్వామికి రూ.31,205 హుండీ కానుకల ద్వారా ఆదాయం వచ్చింది. అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత మృతి

విజయపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): క్షూరికాపురంలో టీడీపీ సీనియర్ నాయుడు విష్ణువర్ధన్‌రాజు సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్నారు. సర్పంచ్‌గా, టీడీపీ మండల అధ్యక్షుడిగా, గౌరవ అధ్యక్షుడిగా వివిధ హోదాల్లో పనిచేశారు. దహన క్రియలు మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు కుటుంబీకులు తెలిపారు. ఆయన మృతికి పలువురు టీడీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

నవజాత శిశువుల సంరక్షణ యూనిట్ ప్రారంభం



ఐరాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఐరాల ప్రభుత్వాసుపత్రిలో నవజాత శిశువుల సంరక్షణ యూనిట్, రిఫ్రిజిరేటర్‌ను ఎంపీడీవో ధనలక్ష్మి సోమవారం ప్రారంభించారు. అనంతరం బదిలీపై వెళుతున్న 10 మంది ఏఎన్ఎంలు సన్మానించారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా చెప్పారు. డాక్టర్ రెడ్డెప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

వరసిద్ధుడి ఆలయానికి ఆటో విరాళం



ఐరాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడి ఆలయానికి సోమవారం చిత్తూరుకు చెందిన శ్రీనివాస మోటర్స్ అధినేత జీవరత్నంరెడ్డి ఓ ఆటోను విరాళంగా అందించారు. ఆటోను ఆలయ లడ్డూ పోటుకు వినియోగించుకోవాలని దాత కోరారు. వాహనం విలువ రూ.3,40,000 ఉంటుందని ఈవో పెంచలకిషోర్ తెలిపారు. దాతకు స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఏఈవో రవీంద్రబాబు, మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా స్పీడ్ బ్రేకర్లు


కట్టమంచిలో ప్రమాదకరంగా ఉన్న స్పీడ్ బ్రేకర్

చిత్తూరు సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో చాలా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. జడ్పీ కార్యాలయం ఎదురుగా, కణ్ణన్ హైస్కూల్ రోడ్డు, కొంగారెడ్డిపల్లె రోడ్డుతదితర ప్రాంతాల్లో ఉన్న స్పీడ్ బ్రేకర్ల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కట్టమంచి రైల్వే బ్రిడ్జి సమీపంలోని స్పీడ్ బ్రేకర్ అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు స్పీడ్ బ్రేకర్ పక్కనే గుంతలు ఉండడంతో ద్విచక్ర వాహనదారులు గమనించక అదుపు తప్పి కిందపడి గాయపడుతున్నారు.

రోడ్డుపైనే మురుగు



పెనుమూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పెనుమూరులో చెక్‌పోస్టు నుంచి దాసరాపల్లెకు వెళ్లే మార్గంలో రోడ్డుపైనే మురుగు పారుతోంది. ఇప్పటివరకు ఈ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.